

నేడు రాష్ట్రస్థాయి చెస్ పోటీలు 10లో.. యువత.. ఉజ్వల భవిత!



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నెల్లూరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి నారాయణ, పక్కన నుడా చైర్మన్ కోటంరెడ్డి తదితరులు

జేఈఈ మెయిన్స్ ఫలితాలు విడుదల

● జిల్లా విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలలో ఇంజనీరింగ్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. ఏప్రిల్ 2 నుంచి 8వ తేదీ వరకు రెండు బ్యాచ్‌లుగా జరిగిన ఈ పరీక్షలకు జిల్లాలో 6వేల మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టిం గ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరిగాయి. శనివారం విడుదలైన మెయిన్స్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు పలు విభాగాల్లో సత్తాచాటుతూ ర్యాంకులను సొంతం చేసుకున్నారు. ఈ ఫలితాల్లో ఉత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులు మే 18వతేదీన జరగనున్న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసేందుకు అర్హత సాధిస్తారు. అడ్వాన్స్‌డ్ పరీక్షకు ఏప్రిల్ 23 నుంచి మే 2వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు.



ఫారంలో పెంచుతున్న బాయిలర్ కోళ్లు

కోడికి మేత భారం

● భారీగా పెరిగిన మొక్కజొన్న, సోయాబీన్ ధరలు

● లబోదిబోమంటున్న పౌల్ట్రీ యజమానులు

సంగం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పౌల్ట్రీ రైతులకు కోళ్ల మేత భారంగా మారింది. మొక్కజొన్న, సోయాబీన్ ధరలు భారీగా పెరగడంతో సాగుదారులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. పౌల్ట్రీ కోళ్లకు ప్రధానంగా వాడే మొక్కజొన్నతోపాటు సోయాబీన్, నూకల ధరలు కొద్దిరోజులుగా ఆకాశాన్ని అంటుతున్నాయి. ఆరు నెలల నుంచి మొక్కజొన్న, నూకలు ధరలు భారీగా పెరిగాయి. క్వింటం మొక్కజొన్న రూ.1800 నుంచి 2600లకు పెరిగింది. సీజన్‌లో ఏకంగా రూ.3200లకు ఎగబాకింది. నూకలు కూడా రూ.1800 నుంచి 2500లకు చేరుకుంది. ధరలు పెరిగినా మొక్కజొన్న, నూకలు కూడా అతి కష్టం మీద కొనుగోలు చేసుకొనే పరిస్థితులు ఉండటంతో రైతుల ఇబ్బందులు పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణలలో మొక్కజొన్నను ఎక్కువగా పండిస్తుంటారు. అయితే పండిన పంటను రైతులు విత్తనాలు రూపంలో అమ్మడంవల్ల మొక్కజొన్నకు గిరాకీ ఏర్పడినట్లు అధికారులు చెబుతున్నారు. నూకలు అందుబాటులో ఉన్నా బీర్ల తయారీలో వినియోగించడం వల్ల తమకు దొరకడం లేదని పలువురు రైతులు చెబుతున్నారు. ఇక మేతలో సోయాబీన్ కూడా ఇటీవల క్వింటం రూ.30 వేల నుంచి 40 వేలు వరకు పెరిగింది. మొక్కజొన్న, నూకలు కొరతను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు చేయాలని భావించినా అవసరమైన సరకు సరఫరాలో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. సాగుదారుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని మొక్కజొన్న, నూకలు కోళ్ల మేతను రాయితీ ధరకు సరఫరా చేయాలని కోరుతున్నారు.

హైస్కూలు ఎదుట కారుస్టాండు తొలగించాలి

కందుకూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలోని ఓవీ రోడ్డులో జడ్పీ హైస్కూళ్ల వద్ద రోడ్డు మార్జిన్‌లో ఉన్న కారుస్టాండుతో విద్యార్థులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుండటంతో తక్షణం కారుస్టాండును అక్కడి నుంచి తీసివేయాలని మున్సిపల్ కమిషనర్ కె.అనూష యూనియన్ ప్రతినిధులకు శనివారం నోటీసులు జారీ చేశారు. జనార్దన కాలనీకి చెందిన షేక్ మంజూర్ బాషా అనేవ్యక్తి అక్కడ కారుస్టాండు వల్ల విద్యార్థులపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశాడని, దీంతో బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎంను వివరణ కోరగా కారుస్టాండు వల్ల ఎంతో అసౌకర్యం అనుభవిస్తున్నట్లు తెలిపారని ఆమె ఆ నోటీసులో పేర్కొన్నారు. ప్రధానంగా గేట్లుకు కూడా అడ్డంగా కార్లు పెడుతున్న పరిస్థితిలో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, కార్లు వెనుకాల మూత్ర విసర్జన కారణంగా పాఠశాలలోకి తీవ్ర దుర్గంధం వస్తున్నదని, పరీక్షలు, ఇతర ముఖ్యదినాలలో ట్రాఫిక్ సమస్య కూడా ఏర్పడుతోందని వివరించారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో నెలరోజుల్లోగా అక్కడి నుంచి ఖాళీ చేయాలని ఆమె ఆదేశించారు.

న్యూస్ బాక్స్

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

కావలి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని వామపక్ష పార్టీలు శనివారం కావలి ట్రంకురోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ నాయకులు పసుపులేటి పెంచలయ్య, బలిజేపల్లి వెంకటేశ్వర్లు, పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కరువది భాస్కర్, సీపీఐఎంఎల్ నాయకుడు లక్ష్మీరెడ్డి, ఆర్‌ఎస్పీ నాయకుడు గోసాల రవికాంత్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు నాగరాజు, దర్గాబాబు, బోసు, ఎల్ శ్యామల, కృష్ణమోహన్, కృష్ణయ్య, నరసింహం పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకులు

కందుకూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల ఛైర్మన్ ఉన్నం భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, కళాశాల యాజమాన్యం, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బాలభాస్కర్, బీ.నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

కావలిటౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్‌లో కావలి నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శనివారం విడుదలైన ఫలితాల్లో నారాయణ విద్యార్థులు 15మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కి అర్హత సాధించారు. కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగిరెడ్డి విద్యార్థులను అభినందించారు.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి

కావలి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 20వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం కావలి ట్రంకురోడ్డులోని ఆయన విగ్రహానికి టీడీపీ నాయకులు, బీసీ వర్గాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు, టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు అర్షియాబేగం, మాజీ జడ్పీటీసీ నాయుడు రాం ప్రసాద్ పలువురు బీసీ నేతలు పాల్గొన్నారు.

పగలే వెన్నెల!



నలదలపూరులో పగలు కూడా వెలుగుతున్న వీధిలైటు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం మండలం నలదలపూరులో రెండు నెలల నుంచి పగలు రాత్రి అనే తేడా లేకుండా వీధిలైట్లు వెలుగుతూనే ఉన్నాయి. దీంతో పంచాయతీపై అదనపు ఆర్థిక భారం పడుతుంది. సంబంధిత పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు కల్లూరు శ్రీనివాసులు, మరికొందరు తెలిపారు. గ్రామంలో మూడో లైను ఏర్పాటు చేసి టైమర్ అమర్చితే ఈ సమస్య పరిష్కారం అవుతుంది. విద్యుత్ వృథా చేయవద్దు పొదుపు చేయాలని ప్రభుత్వం పదే పదే హెచ్చరిస్తున్నా కింది స్థాయి అధికారులకు చెవి కెక్కడం లేదు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధిలైట్లు పగలు రాత్రి వెలగకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత

వలేటివారిపాలెం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను నిషేధించాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని బడేవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహారం, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ హెచ్ఎం మాలకొండయ్య, ఏఎన్ఎం లావణ్య, కార్యకర్తలు రమ, మనోహర, భారతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర' లక్ష్యం నెరవేరాలి



కందుకూరులో వీధులు శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ,



కావలి : స్వచ్ఛాంధ్రకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది



వలేటివారిపాలెం : మాలకొండలో ప్రతిజ్ఞ చేస్తున్న డీసీ సాగర్‌బాబు, సిబ్బంది

కందుకూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర లక్ష్యం నెరవేరాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని అబ్దుల్‌హుస్సేన్ ఆసుపత్రి సెంటర్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరితో పాటు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ ప్రాంతంలో ఎమ్మెల్యే, సబ్ కలెక్టరు, ఇతర అధికారులు, టీడీపీ నేతలు చీపుర్లు పట్టి వీధులను శుభ్రం చేయటంతో పాటు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానికులకు జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. అనూష, డీఈఈ గణపతి, సీఐ వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీవైస్ ఛైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, షేక్ ఖలీల్, సలాం బాషా, తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్, కంప్యూటర్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు ఏడుకొండలు నరేంద్ర మాట్లాడారు. కళాశాలలోని వివిధ విభాగాలలోని 150 కిలోల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించారు. ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పి.రాజగోపాలబాబు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కోటపాటి నరేష్‌రాజా, కంప్యూటర్‌సైన్స్ విభాగాధిపతి జె.హనుమంతరావు పాల్గొన్నారు.

కావలిలో ర్యాలీ

కావలి : స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్, ఎలక్ట్రానిక్ వస్తువుల నిర్వహణ, నియంత్రణకు కట్టుబడి ఉంటామని మున్సిపల్ అధికారులు స్పష్టం చేస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది మున్సిపల్ కార్యాలయం నుంచి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ ర్యాలీ నిర్వహించారు. దారిపొడవున పాడైపోయి ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులను సేకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరాం, రెవెన్యూ అధికారి ఫణీంద్ర పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కావలి రూరల్ : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎమ్పీడీవో శ్రీదేవి, రూరల్ సీఐ రాజేశ్వరరావులు పేర్కొన్నారు. కావలి ఎమ్పీడీవో కార్యాలయం, రూరల్ పోలీస్ స్టేషన్‌ల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం జరిగింది. నివాసాలల్లో పాడైపోయిన ఎలక్ట్రిక్ వస్తువులు డిస్పోజ్ చేసే విధానంపై అవగాహన కల్పించారు.అనంతరం రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి టీచర్సు కాలనీ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు బాలకృష్ణయ్య, తిరుమలరెడ్డి, బాజిబాబు, ఈవోపీఆర్డీ సమద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మండుటెండలో విద్యార్థుల అవస్థ

అల్లూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత అధికారులది. అయితే వార్తే పూర్తిస్థాయిలో ఈ కార్యక్రమాలకు హాజరుకారు. దీంతో స్థానకంగా కొందరు అధికారులు విద్యార్థులను వినియోగించుకోవడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమ ర్యాలీని నిర్వహించేందుకు అధికారులు అల్లూరుపేటలోని రామకృష్ణ విద్యాసంస్థల విద్యార్థులతోపాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను వినియోగించుకున్నారు. వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రభుత్వం ఒంటిపూట బడులు నిర్వహిస్తూ ఎండ ప్రభావం నుంచి తప్పిస్తోంది. అయితే శనివారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న సమయంలో మండుటెండలో రోడ్లపై ర్యాలీ పేరుతో విద్యార్థులను తిప్పడంపై వారి తల్లిదండ్రుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించాలి

కొండాపురం : పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో ఆదినారాయణరావు పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా కొండాపురంలో తహసీల్దారు ఎం.కోటేశ్వరరావు, ఎస్ఐ ఎం.వెంకటరావు తదితరులతో కలసి స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నారాయణరావు, నాయకులు పీ.రమేష్, దాసరి అశోక్, సర్పంచ్ మాచర్ల, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, ఉపసర్పంచ్ మణి పాల్గొన్నారు.

● కలిగిరి : స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, ఎస్ఐ ఉమాశంకర్, పంచాయతీ కార్యదర్శి రవిచంద్రకుమార్, నాయకులు యల్లకర సతీష్, పుల్లా వేమయ్య, ఆవుల ప్రభాకర్‌రెడ్డి, పుల్లారవి పాల్గొన్నారు.

● బిట్రగుంట : బోగోలు గ్రామపంచాయతీలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్వచ్ఛఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జహీర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

వలేటివారిపాలెం : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు తెలిపారు. మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆలయ అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



బిట్రగుంట : బోగోలులో స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో సుబ్రహ్మణ్యం



కొండాపురం : ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో ఆదినారాయణ, ఇతర అధికారులు, నాయకులు



కలిగిరి : స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సర్టిఫికెట్ల పరిశీలనలో దివ్యాంగులకు ఇక్కట్లు!

● సమయపాలన పాటించని వైద్యులు

కందుకూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఏరియా ఆసుపత్రిలో వికలాంగత్వ సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం ప్రహసనంగా మారడంతో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం దివ్యాంగుల సర్టిఫికెట్ల పరిశీలన కోసం ప్రత్యేక కార్యక్రమం చేపట్టి ప్రతిరోజు వంద మందిని పరీక్షిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా సచివాలయాల నుంచి అందిన సమాచారం ప్రకారం దివ్యాంగులు కందుకూరు ఏరియా ఆసుపత్రికి వస్తుండగా ఇక్కడ డాక్టర్లు అందుబాటులో లేకపోతుండటంతో వారు అవస్థలు పడుతున్నారు. అనేకమంది వికలాంగులు ఒకరిద్దరు సహాయకులు లేనిదే రాలేని పరిస్థితికి తోడు



ఆటోలో నిరీక్షిస్తున్న దివ్యాంగుడు

ఆటోలాంటి ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసుకుని రాక తప్పని పరిస్థితి. ఈ స్థితిలో ఒకటికి మూడునాలుగు సార్లు తిరగాల్సి వస్తున్నదని ఆర్థికంగా ఎంతో భారం అవుతోందని దివ్యాంగులు వాపోతున్నారు. ఉలవపాడుకు చెందిన వెలిచర్ల శివకోటయ్యకు గత గురువారం వికలాంగత్వ పరీక్ష కోసం మధ్యాహ్నం 2 గంటలకు ఏరియా ఆసుపత్రికి వెళ్లాలని సచివాలయ సిబ్బంది నోటీసు ఇచ్చారు. దానిప్రకారం వారు ఆరోజు మధ్యాహ్నం వెళ్లగా ఈరోజు డాక్టరు ముందుగానే వెళ్లిపోయాడని శనివారం రావాలని అక్కడి సిబ్బంది చెప్పారు. దీంతో పూర్తిగా నడవలేని స్థితిలో ఉన్న శివకోటయ్యను ముగ్గురు పట్టుకుని ఓ ఆటోలో కందుకూరుకి రాగా శనివారం కూడా సంబంధిత డాక్టర్లు రాలేదన్న సమాధానమే వారికి లభించింది. కనీసం ఎప్పుడు రావాలో కచ్చితంగా చెప్పమని అడిగినా సమాధానం చెప్పే పరిస్థితిలో వారు లేరని, సిబ్బంది నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడని దివ్యాంగులు వాపోయారు. అధికారులు తగినచర్యలు తీసుకుని దివ్యాంగులకు ఇచ్చిన టైమ్‌స్లాట్ ప్రకారం డాక్టర్లు అందుబాటులో ఉండి పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థుల జీవితాలకు గురువులే స్ఫూర్తి

● ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజి

కావలిటౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల జీవితాలకు గురువులే స్ఫూర్తి ప్రదాతలని, వారి స్ఫూర్తితోనే తాను ఈ స్థాయికి ఎదిగానని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజి పేర్కొన్నారు. శనివారం జవహర్ భారతి డిగ్రీ కళాశాలలోని డాక్టర్ ఎస్ఆర్ శంకరన్ సెమినార్ హాల్లో కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన జేబీ స్పోర్ట్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా విశ్వోదయ వ్యవస్థాపకుడు డీఆర్, ఎస్ ఆర్ శంకరన్ చిత్రపటాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలాజీతోపాటు మరో అతిథిగా పాల్గొన్న పూర్వ విద్యార్థి కృపారావులను సన్మానించారు. చివరగా క్రీడా విజేతలకు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంనాయుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి, పీడీ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులందిస్తున్న బాలాజి

● మిత్రబృందం ఆత్మీయ సత్కారం

పుల్లారెడ్డినగర్‌లోని గొట్టిపాటి కల్యాణ మండపంలో బాలాజీ మిత్రబృందం ఆధ్వర్యంలో బాలాజీకి ఆత్మీయ సత్కారమందించారు.మిత్రులు ఆర్ మాల్యాద్రి, నరసింహారవు, ఏసుదాసు, లాయర్ మాల్యాద్రి, గొబ్బిళ్ళ కృష్ణయ్య, మధుసూదన్, కటారి నరసింహారావు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

బిట్రగుంట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొతూరు గ్రామంలో వెలసి ఉన్న కోదండరామస్వామి ఆలయంలో శనివారం సీతారాముల కల్యాణం వైభంగా జరిగింది. రాత్రి స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం వైభంగా జరిగింది.

అగ్నిప్రమాదాలపై అవగాహన

కందుకూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాలు జరిగితే ఎంతో ఇబ్బందికర పరిస్థితులు ఉంటాయని, వాటిని అవగాహన ద్వారా నివారించవచ్చునని కందుకూరు అగ్నిమాపక అధికారి బీ. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఏరియా వైద్యశాలలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టరు ఇంద్రాణి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర అందించాలి

● పొగాకు బోర్డు వైస్‌చైర్మన్ బ్రహ్మయ్య

కలిగిరి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రైతులకు మద్దతు ధర అందించాలని పొగాకు బోర్డు వైస్‌చైర్మన్ బ్రహ్మయ్య వ్యాపారులకు సూచించారు. శనివారం స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పొగాకు అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించి వేలం ప్రక్రియను పరిశీలించారు. రైతులు పండించిన నాణ్యమైన పొగాకు గ్రేడింగ్‌కు మద్దతు ధర పూర్తి స్థాయిలో అందించాలని కంపెనీ ప్రతినిధులను కోరారు. అదే విధంగా రైతులు పొగాకు బేళ్లను మిక్సింగ్ గ్రేడింగ్ లేకుండా మార్కెట్ ప్రయోజనాన్ని పొందడానికి బోర్డు అధికారులు సూచించే నియమాలను అనుసరించి తీసుకురావాలని సూచించారు. సాగుదారులు పొగాకు పంటపైనే ఆధారపడకుండా ఇతర పంటల సాగుకు మొగ్గు చూపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్ ఉన్నారు.



పొగాకు కొనుగోళ్లు పరిశీలిస్తున్న బోర్డు వైస్‌చైర్మన్ బ్రహ్మయ్య

● 104 పొగాకు బేళ్లు తిరస్కరణ

స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు 365 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 261 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-84, ఆర్ఆర్-3, సీఆర్-12, జంపింగ్‌లాట్స్-5 కారణాలతో 104 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.220, సగటు ధర రూ.252.40గా నమోదైనట్లు పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

లక్ష్మీనృసింహుడి సేవలో ముగ్గురు ఎమ్మెల్యేలు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం కందుకూరు, సర్వేపల్లి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దంపతులు దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. అష్టోత్తర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంగోమాతకు పూజలు నిర్వహించారు. ఆలయ డీసీ కేవీ.సాగర్‌బాబు, నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాను హర్ష, మన్నం మాధవరావు, మన్నం నరేష్, సోమినేని రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.



గోమాతకు అరటిపండు పెడుతున్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, ఇంటూరి

ఆధార్‌కార్డులకు అర్హులం కాదా?

● తహసీల్దార్ కార్యాలయం వద్ద యానాదుల నిరసన

కావలి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తీరప్రాంత గ్రామాల్లో యానాదులు ఆధార్‌కార్డులు పొందడానికి అర్హులు కాదా అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. కావలి మండలం నడింపల్లికి చెందిన యానాదులతో శనివారం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహసీల్దార్ పీ.శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ యానాదులకు ఆధార్‌కార్డులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరికీ ఆధార్‌కార్డులు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాపూరు పంతులమ్మ, కత్తి వెంకటరమణ, జెడ్డా వాసు, తదితరులు పాల్గొన్నారు.

కావలిలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ

కావలిటౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణంలో శనివారం క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. ఆరాధన టీవీ ఆధ్వర్యంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పాడేటి థామస్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పీటర్ పాల్ మినిస్ట్రీస్ కన్వీనర్ పీటర్ దేవరకొండ సుధీర్ పాల్గొని పరుగును ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏసుబాబు, దైవజనులు కృపారావు, జోసఫ్ నిరీక్షణ్‌రావు పాల్గొన్నారు.

బిట్రగుంట : క్రైస్తవ సంఘాలు, క్రైస్తవులు పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యక్షుడు శ్యాంసన్‌బాబు, కార్యదర్శి జీహెచ్ నాగరాజులతో కలసి విశ్వనాథరావుపేట నుంచి బోగోలు అంబేద్కర్ విగ్రహం వరకు రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు.

చల్లగా వేచి ఉండండి !





● నగరంలో ఏసీ బస్ షెల్టర్లు

బస్సులు, ఆటో, ఇతర ఏ వాహనం కోసం వేచి ఉండే షెల్టర్లు చల్లని ఏసీతో ఉండటం ఇప్పటి వరకు విదేశాల్లోనే చూశాం. కానీ ఈ సౌకర్యం ఇప్పుడు నెల్లూరు నగరంలోనూ అందుబాటులోకి వచ్చింది. 2014 - 19లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పురపాలక శాఖ వీటిని రాష్ట్రంలోనే ప్రత్యేకించి నెల్లూరులో ప్రయోగాత్మకంగా ఈ ఏసీ షెల్టర్లను నిర్మించింది. అయితే, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిని మూలనపడేసింది. వాటి బాగోగులు గాలికి వదిలేయడంతో ఏసీ యంత్రాలు సైతం చోరీకి గురయ్యాయి. 2024లో తిరిగి అధికారంలోకి వచ్చిన టీడీపీ తాజాగా నెల్లూరులోని ఆరు ప్రాంతాలలో సిద్ధంగా ఉన్న ఏసీ బస్‌షెల్టర్లను ఆధునీకరించి ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చింది. గాంధీబొమ్మ కూడలి, మద్రాసు బస్టాండ్ సెంటరు, శబరిశ్రీరామ క్షేత్రం, పెద్దాసుపత్రి జంక్షన్, అయ్యప్పగుడి కూడలి వద్ద ఇవి వినియోగంలో ఉన్నాయి.

- నెల్లూరు(సిటీ, ఆంధ్రజ్యోతి)

హిందుత్వ ఎజెండా కోసమే వక్ఫ్ సవరణ చట్టం

● దీన్ని అందరూ వ్యతిరేకించాలి ● రౌండ్‌టేబుల్ సమావేశంలో నేతలు

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : హిందుత్వ ఎజెండా కోసమే వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో వక్ఫ్ చట్టంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్‌తో పాటు పలు ప్రజా సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ముస్లింలు విచ్చలవిడిగా భూములు ఆక్రమించుకోడానికి గత వక్ఫ్ చట్టాన్ని ఉపయోగించారంటూ పదేపదే కేంద్రం చెబుతున్నదన్నారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో ముస్లిమేతరులను తాజా చట్టంలో చేర్చిందన్నారు. ఇది ముస్లింల హక్కులపై దాడేనని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సవరించిన వక్ఫ్ చట్టం వల్ల ముస్లిం, హిందూ ఐక్యతకు విఘాతం ఏర్పడుతుందని చెప్పారు. సీపీఐ సీనియర్ నేత రామరాజు మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసిన అమ్ముకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వ ఈ నూతన చట్టాన్ని తీసుకు వచ్చిందన్నారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నూతన వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నేత మాదాల వెంకటేశ్వర్లు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్, పలు ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం



ఎంపికైన విద్యార్థులతో అసోసియేషన్ సభ్యులు

షూటింగ్ బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కోవూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఈనెల 26, 27 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును స్థానిక బాలికోన్నత పాఠశాలలో శనివారం ఎంపిక చేశారు. జిల్లా బాలుర జట్టుకు సాయి నిఖిల్, నందకిషోర్, భాను ప్రకాష్, ప్రభాస్, పవన్‌తేజ, యశ్వంత్, హర్ష, చరణ్‌సాగర్, అభిలాష్, గౌతమ్, నవీన్, అభిలాష ఎంపికయ్యారు. బాలికల జట్టుకు చందన, జానకి, అమూల్య, గాయత్రి, వైష్ణవి, అంజలిదీప్తి, హరిత, త్రిసత్య, వెంకటమాధవి, మధులేఖ, సింధు, గౌతమి ఎంపికైనట్లు అసోసియేషన్ ప్రకటించింది. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి భీమతాటి వెంకటరమణయ్య, పాటూరు జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణపర్తి వెంకటేశ్వర్లునాయుడు, ఉపాధ్యాయుడు పర్వతరెడ్డి జనార్దనరెడ్డి, వార్డెన్ నాగరాజు తదితరులు అభినందించారు.

సంగం బ్యారేజీ అసంపూర్తి పనులు పూర్తిచేస్తాం

● తెలుగుగంగ సీఈ వరప్రసాదరావు

సంగం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా మిగిలిన సంగం బ్యారేజి పనులను పూర్తిచేస్తామని తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ వరప్రసాదరావు పేర్కొన్నారు. శనివారం ఆయన తెలుగుగంగ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి బ్యారేజిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగం బ్యారేజ్ కం బ్రిడ్జిని నెల్లూరు - ముంబయి జాతీయ రహదారికి అనుసంధానం రోడ్డుతో పాటు బ్యారేజ్‌లో మిగిలిపోయిన వివిధ కాలువల లైనింగ్, ఫ్లడ్ బ్యాంక్‌ల నిర్మాణం, పెన్నా నదికి రెండు చోట్ల ఘాట్‌లు, గెస్ట్‌హౌస్, కనిగిరి ప్రధాన కాలువ, దువ్వూరు కాలువలపై ఉన్న వంతెనలు తొలగించి కొత్తవి ఏర్పాటుచేస్తామని తెలిపారు. ఈ పనులన్నింటికీ సుమారు రూ. 75 కోట్లతో ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఆమెదం లభించిన వెంటనే టెండర్లు పిలిచి మిగతా పనులు పూర్తిచేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఈఈ మేకల అనీల్‌కుమార్‌రెడ్డి, డీఈ శ్రీనివాసులురెడ్డి, ఏఈ విజయరామిరెడ్డి, వినయ్‌కుమార్, బ్యారేజి నిర్మాణ ప్రతినిధులు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



సంగం బ్యారేజీలో అసంపూర్తిగా ఉన్న పనులను పరిశీలిస్తున్న తెలుగుగంగ సీఈ వరప్రసాదరావు

'కామధేను'కు గొంతెండుతోంది!

● దాహంతో అల్లాడుతున్న పశువులు ● వేధిస్తున్న నిధుల కొరత

● పోస్టులు భర్తీ కాకపోవడంతో ఉన్నవారిపై పనిభారం

కొండాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : చింతలదీవి పశుసంవర్ధక క్షేత్రంలోని కామధేను పునరుత్పత్తి కేంద్రంలో పశువులు దాహంతో అల్లాడుతున్నాయి. పచ్చిగడ్డి సాగుకు కూడా నీరు లేకపోవడంతో ఎండుగడ్డిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2015లో ప్రారంభమైన ఈ కేంద్రానికి అప్పటి కేంద్ర ప్రభుత్వం రూ.250 కేటాయించి, తొలి విడతగా రూ.25 కోట్లు మంజూరు చేసింది. తొలినాళ్లలో కేంద్రం పనులు చకచకా జరగ్గా ఆ తర్వాత నిధుల లేమితో నత్తనడకన సాగుతున్నాయి. తొలి విడత నిధులతో పశువుల షెడ్లు, సిబ్బందికి క్వార్టర్లు తదితర భవనాలు నిర్మించారు. దేశం నలుమూలల నుంచి దాదాపు 20 రకాల ఆవులను, గేదెలను కొనుగోలు చేశారు. కామధేను కేంద్రంలో 14 రకాల స్వదేశీ మేలుజాతి ఆవులు, 5 రకాల గేదెలు ఉన్నాయని అధికారులు చెబుతు న్నారు. వీటి నుంచి ఎంబ్రియో (వీర్యం)ను సేకరించి స్థానికంగా మేలుజాతి ఆవులు, గేదెలకు కృత్రిమ గర్భధారణ చేయిస్తున్నారు.

వేధిస్తున్న నీటిసమస్య

ఆర్‌ఐడీఎఫ్ పథకం కింద రాళ్లపాడు రిజర్వాయరు నుంచి నీటిని తరలించేందుకు 2017లో రూ.12.5 కోట్లను ప్రభుత్వం మంజూరుచేసింది. పనులు మొదలై దాదాపుగా సగం వరకు పూర్తవగా అనివార్యకారణాలతో ఆగిపోయాయి. ఆ తర్వాత మర్రిగుంట చెరువు నుంచి నీటిని తరలించేందుకు రూ.3.20 కోట్లు మంజూరయ్యాయి. పనులు పూర్తయినా నీరు మాత్రం కామధేను కేంద్రానికి చేరలేదు. చెరువు నుంచి నీటిని తరలించి కేంద్రంలో నిర్మించిన ప్రత్యేక స్టోరేజీ ట్యాంకులలో నిల్వ ఉంచి పశువులకు వాడుకోవాల్సి ఉంది. అయితే, నిధులు విడుదల చేయకపోవడంతో ట్యాంకు వినియోగంలోకి రాలేదు. ఇక కేంద్రంలో ఉన్న బోర్లు పశువుల నిత్యావసరాలకే సరిపోవడంలేదు. వేసవి కాలం కావడంతో నీటి సమస్య జటిలమవుతోంది. పశుగ్రాసం పెంచేందుకు కొత్త బోర్లు వేయాల్సి ఉంది. అలాగే షెడ్లు, పోస్ట్ మార్టం కోసం ప్రత్యేక గది తదితర భవన నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.3.65 కోట్లు కేటాయించినా రెండు విడతలలో కేవలం రూ.1.82 లక్షలు మాత్రమే మంజూరయ్యాయి. సీఎల్ఎఫ్, కామధేను కేంద్రాలలోని ఆవులు, పశువులకు 50 ఎకరాలలో పచ్చగడ్డి సాగు చేస్తున్నారు. నీటి సమస్య కారణంగా ఎక్కువ విస్తీర్ణంలో గడ్డిని సాగుచేయలేకపోతున్నారు. రైతుల నుంచి 572 టన్నుల ఎండుగడ్డిని సేకరించాలని క్షేత్ర అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఇప్పటివరకు సుమారు 350 టన్నుల గడ్డిని మాత్రమే సేకరించారు.



కేంద్రంలో ఏర్పాటుచేసిన ఎంబ్రియో ట్రాన్స్‌ఫరెన్సీ ల్యాబ్



కామధేను పునరుత్పత్తి కేంద్రంలో ఆవులు

సిబ్బంది కొరత

కామధేను కేంద్రానికి ఒక జేడీ, ముగ్గురు ఏడీలు ఉన్నారు. సీనియర్ అసిస్టెంటు లేరు. ఆరుగురు ఎల్ఎస్ఏలు ఉండాల్సి ఉండగా నలుగురు, ఆరుగురు వీఏఏలకు ఒక్కరు కూడా లేదు. కాంపౌండర్లు నలుగురు ఉండాల్సి ఉండగా ఇటీవలే ముగ్గురిని కేటాయించగా ఇద్దరు మాత్రమే విధుల్లో చేరారు.

- వేంకటేశ్వర్లు జేడీ, ఎన్‌కేబీసీ

వెంటాడుతున్న వ్యాధులు

కామధేను కేంద్రంతోపాటు చింతలదీవి పశుసంవర్ధక క్షేత్రం ఒకేచోట ఉండటంతో ఆవులు, గొర్రెలు ఒకే పొలంలో మేత మేయాల్సి వస్తోంది. గొర్రెలలో ఎక్కువగా ఉండే బ్రూసెల్లోసెస్ వ్యాధి ఆవులకూ సోకుతోంది. వ్యాధి సోకిన ఆవులకు వైద్యం చేసేందుకు ప్రత్యేక షెడ్లు అందుబాటులో లేవు. దీంతో వ్యాధి సోకిన ఆవు నుంచి ఇతర ఆవులకూ సోకుతోంది. కామధేను ప్రాజెక్టు ఏర్పాటయితే స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఆశపడ్డ నిరుద్యోగుల ఆశలు నెరవేర లేదు. రోజువారీ కూలీలుగా పని చేస్తున్నారే తప్ప పర్మినెంటు ఉద్యోగ అవకాశం లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక పోస్టులు కూడా భర్తీ కాకపోవడంతో ఉన్నవారిపై పనిభారం ఎక్కువ అవుతోంది.

నేడు రాష్ట్రస్థాయి చెస్‌పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాచెస్ అసోసియేషన్, శ్రీఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని సిల్వర్‌ఓక్స్ పాఠశాలలో ఆదివారం రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి వై.సుమన్ తెలిపారు. పోటీలకు సంబంధించిన పోస్టర్లను శనివారం పాఠశాల ప్రాంగణంలో విడుదల చేసి మాట్లాడారు. ఇప్పటికే అన్ని జిల్లాల క్రీడాకారులకు పూర్తి సమాచారం అందచేశామని, పెద్ద సంఖ్యలో క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు రూ.55వేల నగదు బహుమతులతోపాటు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు, సర్టిఫికెట్‌లు అందచేస్తున్నామని తెలిపారు. క్రీడాకారులందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కూడా కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, టోర్నీ నిర్వాహకులు పాల్గొన్నారు.

యువత.. ఉజ్వాల భవిత!

నైపుణ్యాల పెంపునకు కేంద్ర ప్రభుత్వ పథకం

పేరుగాంచిన కంపెనీల్లో శిక్షణ ● దరఖాస్తు దాఖలకు 22 వరకే గడువు

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల 19 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువత ఉజ్వల భవిత పొందాలనే సదాశయంతో వారిలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద ఇప్పటికే జిల్లాలో 1,126 మంది దరఖాస్తు చేసుకోగా, ఈ నెల 22వ తేదీకి దరఖాస్తు గడువు ముగియనుంది.

● **ఇంటర్న్‌షిప్ ఇలా..**

బ్యాంకింగ్, సాఫ్ట్‌వేర్, హాస్పిటాలిటీ, ఆయిల్, గ్యాస్ అండ్ ఎనర్జీ, మైనింగ్, టెలికాం, రిటైల్, సిమెంటు, బిల్డింగ్ మెటీరియల్, ఫార్మాసూటికల్, ఏవియేషన్, మాన్యుఫ్యాక్చరింగ్, అగ్రికల్చర్ తదితర రంగాల్లో ఇంటర్న్‌షిప్ అందిస్తారు. 12 నెలలపాటు శిక్షణ ఉంటుంది. వన్‌టైం గ్రాంట్ కింద రూ.6వేలతోపాటు ప్రతినెలా ప్రభుత్వం రూ.4500, కంపెనీ రూ.500 వంతున డీబీటీ ద్వారా జమ చేస్తారు. ఈ లెక్కన ఏడాదికి రూ.66 వేలు పొందే అవకాశం ఉంది.

● **అర్హులు వీరే!**

దరఖాస్తుదారులు కనీసం 10వ తరగతి లేదా దానికి సమాన విద్యార్హత కలిగి ఉండాలి. ఇంటర్, డిగ్రీ, డిప్లమో, ఐటీఐ పూర్తిచేసిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కొన్ని ప్రత్యేక సాంకేతిక నైపుణ్యాలు లేదా నిర్ధిష్ఠ రంగాలలో అనుభవం ఉన్న అభ్యర్థులకు ఎంపిక ప్రక్రియలో ప్రాధాన్యం ఉంటుంది. 21 నుంచి 24 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వ పీఎం ఇంటర్న్‌షిప్ పోర్టల్ ద్వారా తమ వివరాలు రిజిస్టర్ చేసుకోవాలి. ఆధార్ అనుసంధానమైన సెల్‌ఫోన్ నెంబరు, బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అభ్యర్థి ప్రొఫైల్‌లో ఈకేవైసీ పూర్తి చేయాలి. వ్యక్తిగత వివరాలు, విద్యార్హత, చిరునామా, కేటగిరి, ఈమెయిల్ ఐడీ, బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయాలి.

● **ఎంపిక ఇలా**

పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకున్న వారికి ఆబ్జెక్టివ్ పద్ధతిలో పరీక్ష నిర్వహిస్తారు. అర్హులైన అభ్యర్థులు పీఎం ఇంటర్న్‌షిప్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అనంతరం ఎంచుకున్న పరిశ్రమలకు సంబంధించి నైపుణ్యాలు నేర్పిస్తారు. అర్హత సాధించిన వారికి ప్రధాన మంత్రి బీమా కవరేజ్ ఉంటుంది.

వైసీపీలా 'చెత్త' ప్రభుత్వం కాదు!

● సమాజానికి మేలు చేయాలన్నది మా లక్ష్యం

● స్వచ్ఛ దివస్ ర్యాలీలో పురపాలక మంత్రి నారాయణ

నెల్లూరు (సిటీ), ఏప్రిల్ 19,(ఆంధ్రజ్యోతి) : సమాజానికి మేలు చేయాలన్న లక్ష్యంతో రాష్ట్రంలో కూటమి ఆవిర్భవిం చిందని, వైసీపీలా చెత్త పై పన్నువేసి ప్రజలను పీడించు కుతినే ఆలోచనలు తమ ప్రభు త్వానికి లేవని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శనివారం నగరం లోని వీఆర్సీ కూడలి నుంచి నర్తకి సెంటర్ వరకు స్వచ్ఛ దివస్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ఊరూవాడ శుభ్రంగా ఉంచుకునే బాధ్యతను ప్రజలందరూ తీసుకో వాలని పిలుపునిచ్చారు. ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛతా ర్యాలీలో ఒక్కో కొత్త అంశాన్ని తెరపైకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. గడిచిన వైసీపీ సర్కారు రూ. లక్షలు అప్పులతోపాటు 85 లక్షల టన్నుల చెత్తను డంపింగ్‌యార్డులో మిగిల్చిందని, దానిని బయోమైనింగ్ ద్వారా శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వీర్యం చేస్తున్నట్లు చెప్పారు.

● **ఆకట్టుకున్న ర్యాలీ**

స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా జరిగిన ఈ ర్యాలీ ఆకట్టుకుంది. నర్తకి సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి నారాయణ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ ర్యాలీలోనే స్వీపింగ్ యంత్రాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌కుమార్‌రెడ్డిలతో కలిసి అల్లీపురంలోని డంపింగ్ యార్డు వద్ద బయోమైనింగ్ ప్లాంటును ప్రారంభించారు. కాగ స్టోన్‌హౌస్‌పేటలోని బీవీఎస్ బాలికల స్కూల్ వద్ద ఈ వేస్ట్ కలెక్షన్ సెంటర్‌ను, పాతమున్సిపల్ కార్యాలయం వద్దనున్న అన్న క్యాంటీన్ భవనం పక్కన రూ.2లకే 20 లీటర్ల తాగునీటిని అందించే ఎన్టీఆర్ సృజల స్రవంతి తాగునీటి పథకం ప్లాంటును మంత్రి నారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎస్ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, ఎంహెచ్‌వో చైతన్య, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, టీడీపీ నగర్ ఇన్‌చార్జి మధు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్వీపింగ్ యంత్రాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి తదితరులు

ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించండి

● 5 ఎకరాల్లోపు పొలాలకు ఉచితంగా మొక్కలు

● ఖాళీగా ఉన్న భూములు గుర్తించండి : డ్వామా పీడీ గంగాభవాని

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సాగు చేసుకోలేని నిరుపేద రైతులకు ఆరుతడి పంటల సాగుకు సహకరించనున్నామని, ఇందుకు ఐదెకరాలలోపు పొలాలను గుర్తించాలని డ్వామా పీడీ గంగాభవాని అధికారులను ఆదేశించారు. డ్వామా, వ్యవసాయ, ఉద్యాన, గిరిజనాభివృద్ధి శాఖల అధికారులతో శనివారం తన చాంబర్‌లో ఆమె సమీక్షించారు. 5ఎకరాల లోపు పొలం ఉండి, సాగు చేసుకోలేని నిరుపేద రైతులకు ఉచితంగా ఆరుతడి పంటలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అన్నిశాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పొలాలను గుర్తించే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించాలని ఆదేశించారు. ఈ ఏడాది 3500 ఎకరాలు సాగులోకి తీసుకు రావాలన్న లక్ష్యం ఉందని, దానికి మించి 5వేల ఎకరాల వరకు సాగుచేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఖాళీగా ఉన్న పొలాలను గుర్తించడంతో పాటు, మట్టి పరీక్షలు చేయించి, ఏ నేలలో ఏ పంటలు అనువుగా ఉంటాయో రైతులకు సూచించాలన్నారు. మామిడి, నిమ్మ వంటివే కాకుండా నేరేడు, సీతాఫలం, జీడిపప్పు పంటలను వేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు కావాల్సిన మొక్కలను ఉచితంగా అందించడమేగాక మూడేళ్లపాటు సంరక్షణను చేపడతామన్నారు. నీటి ఇబ్బందులు లేకుండా ప్రతి పొలంలో 5నుంచి 6 సెంట్లలో నీటిగుంటలు ఏర్పాటు చేస్తామని, దీంతో బోరులు, బావులలో నీటిమట్టాలు తగకుండా ఉండేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ సమీక్షలో ఏపీఎంఐపీ పథక సంచాలకులు బి, శ్రీనువాసులు, జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి, ఐటీడీఏ, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా పెంచలోరి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున స్వామి వారికి పంచామృతాభిషేకం జరిపారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం ఉంజల్ సేవ, సాయంత్రం స్వామి వారికి క్షేత్రోత్సవం నిర్వహించినట్లు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం


పెంచలకోన క్షేత్రంలో శ్రీవారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం రాజంపేట నూనెవారిపల్లి వాస్తవ్యులు అన్నంగి జస్వంత్, షణ్ముకి 50,116 రూపాయలు నగదును అందజేశారు. వారికి అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

క్లిక్.. క్లిక్.. !

● వెలుగొండల్లో కెమెరాలకు చిక్కిన వన్యప్రాణులు

ఉదయగిరి రేంజ్ పరిధిలో విస్తరించిన వెలుగొండ అడవిలో వన్యప్రాణుల సంచారాన్ని కెమెరాలు బంధించాయి. జంతు గణనలో భాగంగా మార్చిలో అటవీ అధికారులు సీతారామపురం, ఆర్లపడియ, పంద్రింగి, కొత్తపల్లి, శకునాలపల్లి బీట్‌ల పరిధిలో తాగునీటి వనరులకు సమీపంలో సుమారు 40 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆ కెమెరాల్లో డేటాను ఇటీవల అధికారులు పరిశీలించగా సీతారామపురం అటవీ ప్రాంతంలో చిరుతపులి, మిగిలిన అటవీ ప్రాంతాల్లో ఎలుగుబంట్లు, చుక్కల దుప్పిలు, నెమళ్లు, ఇతరత్రా వన్యప్రాణులు సంచిరిస్తున్న దృశ్యాలు వెలుగుచూశాయి.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)



సీతారామపురం అడవుల్లో చిరుత




కెమెరాలకు చిక్కిన ఎలుగుబంటి, చుక్కలదుప్పి

మాలకొండలో అధిక రేట్లపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వలేటివారిపాలెం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో దుకాణదారులు పూజా సామగ్రిని అధిక ధరలకు విక్రయించడంపై గుంటూరు డీసీ కేబీ శ్రీనివాసరావు శనివారం విచారణ చేపట్టారు. గత రెండు వారాల క్రితం మాలకొండలో భక్తుల నిలువ దోపిడీ అని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పందించి విచారణ చేపట్టాలని గుంటూరు డీసీకి ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఆయన శనివారం మాలకొండకు చేరుకుని విచారణ చేపట్టారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబును అడిగి వివరాలు తెలుసుకున్నారు. దుకాణాల వద్దకు వెళ్లి ధరల పట్టికలను పరిశీలించారు. విక్రయిస్తున్న ధరల వివరాలను భక్తులను అడిగి తెలుసుకున్నారు. నివేదిక దేవాదాయశాఖ మంత్రి రామనారాయణరెడ్డికి అందజేస్తానని శ్రీనివాసరావు తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ. 8,77,549

మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.8,77,549 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు తెలిపారు. ప్రతేక దర్శనానికి రూ.3,20,500, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.2,03,545, అన్నదానం ద్వారా రూ.2,46,864, తలనీలాల సమర్పనకు రూ.45,250, రూము అద్దెలు ద్వారా రూ.31,490, కుంకుమార్చనకు రూ.16,940, వివిధ టిక్కెట్ల ద్వారా రూ.12,960 వచ్చినట్లు ఆయన తెలిపారు.

డిగ్రీ పరీక్షలకు 84 మంది గైర్హాజరు

వెంకటాచలం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో శనివారం జరిగిన డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షలకు 84మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో 1018 మంది విద్యార్థులకు గాను 934 మంది హాజరయ్యారన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9213
వెండి కిలో ధర	రూ. 98,400
వెండి ఒక గ్రాము	రూ.101.40

న్యూస్ బాక్స్

నెలాఖరులోపు రేషన్‌కార్డు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి

పొదలకూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నెలాఖరులోపు రేషన్‌కార్డు ఈకేవైసీ పూర్తిచేసుకోవాలని తహసీల్దారు శివకృష్ణయ్య కార్డుదారులకు సూచించారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో రేషన్‌డీలర్లు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకోని వారి వివరాలు స్థానిక డీలర్, వీఆర్‌ఓ వద్ద ఉన్నాయని, సంబంధిత కార్డుదారులు వారిని సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. బయోమెట్రిక్ సమస్య ఉన్నవారు ఆధార్ సెంటర్‌లో ఆధార్ అప్‌డేట్ చేయించుకుని, తదుపరి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయిస్ డీటీ ఐ రవి, వీఆర్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి : డీపీవో



పొదలకూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం పొదలకూరు పట్టణంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ర్యాలీలో ఆయన పాల్గొని ఎంపీడీవో కార్యాలయం నుంచి గేట్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రధానంగా తాగునీటి సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహారావు, సెక్రటరీ శీనయ్య, టీడీపీ మండల అధ్యక్షులు తలచీరు మస్తాన్ బాబు, బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, బోగోలు భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

రాపూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక ప్రాథమిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో అగ్నిమాపక అధికారి వి కుప్పయ్య ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రమాదాలు సంభవించి నప్పుడు ఎలా నివారించాలో ఆసుపత్రి సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఎఫ్‌లు సుధాకర్‌వర్ధన్, శ్రీనివాసులు, డివో పి సూర్యనారాయణ, ఎఫ్‌ఎంలు హరి, పెంచలయ్య, చంద్రకుమార్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

నెలలో ఒక రోజు ఈ-వేస్ట్ సేకరించాలి

● స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ ర్యాలీలో కలెక్టర్ ఆనంద్

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ భాగంగా నెలలో ఒక రోజు ఇంటింటికీ వెళ్లి ఈ-వేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు) సేకరించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా 3వ శనివారం చేపట్టే స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం బుచ్చి నగర పంచాయతీలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ బాలకృష్ణతో కలసి స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుంచి జొన్నవాడ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సేకరించిన వ్యర్థాలను రీ సైక్లింగ్ యూనిట్‌కు పంపించాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ ర్యాలీలో నగర పంచాయతీ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం : స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్‌పై ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ ఆనంద్, చైర్‌పర్సన్ సుప్రజ, కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు తదితరులు

మట్టి నమూనాల సేకరణ

ఇందుకూరుపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని లేబూరులో వ్యవసాయాధికారి డీ.రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి మండలంలో 559 మట్టి నమూనాలు సేకరణ లక్ష్యంగా నిర్ణయించామని ఆయన తెలిపారు. మండలంలోని 18 రైతు సేవా కేంద్రాల పరిధిలో విస్తీర్ణంను బట్టి ఒక్కొక్క ఆర్‌ఎస్‌కేకి 50 నుంచి 60 మట్టి నమూనాలు సేకరణ లక్ష్యంగా నిర్ణయించామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మట్టి నమూనాలు తీయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత పాటించాలి

రాపూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపిడివో భవాని సూచించారు. శనివారం 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిం చారు. ఈసందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యాల యంలో పరిశుభ్రత పాటించాలని, ఫైళ్లను, ఫర్నీచర్‌ను క్రమ పద్ధతిలో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో భవాని, సిబ్బంది



కోవూరు : కేక్ కట్ చేస్తున్న చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి

ఎంపీ వేమిరెడ్డి జన్మదిన వేడుకలు

ఇందుకూరుపేట : నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు టీడీపీ మండల కన్వీనర్ రావెళ్ల వీరేంద్రచౌదరి ఆధ్వర్యంలో జరిగాయి. ఆయన మాట్లాడుతూ పార్లమెంటు సభ్యత్వానికి వన్నె తెచ్చిన నాయకుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో 300 మంది టీడీపీ కార్యకర్తలు కనుపర్తిపాడు వీపీఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. కుడితిపాలెంలో అప్పస్వామి శ్రీనివాసులు ఆధ్వర్యంలో 150 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిరమన సుధాకర్‌రెడ్డి, గుండాల కృష్ణారెడ్డి, ఈదూరు చెన్నయ్య, మునగాల రంగారావు, బొల్లినేని హరినాయుడు, అప్పని శ్రీనివాసులు, బండ్ల మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు. అలాగే మైపాడ్ బీచ్‌లో దువ్వూరు కల్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో వేమిరెడ్డి జన్మదిన వేడుకలు జరిగాయి. మత్స్యకారులు సముద్రంలో బోటుషికార్ చేస్తూ వీపీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడూరు కమలాకర్‌రెడ్డి, బిరదవోలు వంశీకృష్ణారెడ్డి, పొన్నెబోయిన చెంచుకిషోర్‌యాదవ్, దాసరి విజయ్‌కుమార్, ముంగర గోపాల్, ముత్తుకూరు సుధాకర్, కూకటి వెంకటేశ్వర్లురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● కోవూరు : స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి కేకు కట్ చేశారు. ఈ కారక్రమంలో టీడీపీ నాయకులు కలికి సత్యనారాయణరెడ్డి, ఇందుపూరు మురళీ కృష్ణారెడ్డి, ఇంటూరి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట : రక్తదానం చేస్తున్న వీరేంద్రచౌదరి

● విడవలూరు : ఏపీ సంప్రదాయ మత్స్యకారకుల సంక్షేమ సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవుల వాసు ఆధ్వర్యంలో రామతీర్థంలోని కామాక్షీదేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేయించారు. ముదివర్తిలో మండల కో ఆప్షన్ మెంబరు ఎస్.కె.రఫీ ఆధ్వర్యంలో ఎంపీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి, తెలుగుయువత నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, వేగూరు చంద్రారెడ్డి ఎంపీని కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సోమశిలలో 51.930 టీఎంసీల నీరు

అనంతసాగరం, ఏప్రిల్ 19 ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి నిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారం నాటికి 51.930 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 50, దక్షిణ కాలువకు 200, డెల్టాకు 1000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

వీఎస్‌యూలో విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు

వెంకటాచలం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో శనివారం ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఎంబీఏ విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రముఖ రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ సంస్థ తరఫున ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించగా 10 మంది విద్యార్థులు ఎంపిక య్యారు. ఎంపికైన విద్యార్థులు త్వరలోనే స్టోర్ మేనేజర్ హోదాలో రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ సంస్థలో చేరనున్నారు. ఈసందర్భంగా వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ మాట్లాడుతూ తమ విద్యార్థులకు నైపుణ్యాలతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ సెల్ అధికారి డాక్టర్ జీ సాయి స్రవంతి పాల్గొన్నారు.



ఎంపికైన ఎంబీఏ విద్యార్థులతో వర్సిటీ కళాశాల ప్రొఫెసర్లు, రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు

విద్యార్థినికి అభినందన

కోవూరు, ఏప్రిల్ 19 (ఆంధ్ర జ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షల్లో బైపీసీ గ్రూపులో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన సమీర్ ను శనివారం టీఎస్‌సీ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో డీవీఈవో మధుబాబు అభినందించారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ ఎస్‌ఏ సికిందర్, ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి, ఏజీఎంసీ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



సమీర్‌ను అభినందిస్తున్న డీవీఈవో మధుబాబు, ప్రిన్సిపాల్ సికిందర్

వెయ్యి రోజుల సంరక్షణపై అవగాహన ఉండాలి

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గర్భం దాల్చినప్పటి నుంచి కాన్పు తరువాత బిడ్డకు రెండేళ్లు వచ్చేవరకు వెయ్యి రోజుల సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల సూచించారు. శనివారం బుచ్చిరెడ్డిపాళెం ఖాజానగర్‌తోపాటు మండలంలోని రెడ్డిపాళెం తదితర గ్రామాల్లో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు సుమలత, అంగన్వాడీ కార్యకర్త ప్రమీల పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 'ప్రైవేట్' హవా!

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్ సెషన్ పరీక్ష ఫలితాలను శనివారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) విడుదల చేసింది. ఈ ఫలితాల్లో నగరంలోని ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో సత్తా చాటారు. పలువురు విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్‌తో అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు.

నారాయణ ప్రతిభ



జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నారాయణ ఐఐటీ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చూపి ర్యాంకులు సాధించారని ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని ఆ కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జనరల్ కేటగిరీలో కె.పూర్వజ్ 337వ ర్యాంకు, ఎం.హేమంత్‌సాయి 815, ఎం.మధుకిరణ్‌రెడ్డి 1021, బి.భాను రిషిక్ 1216, ఎం.అఖిలేష్ 1415వ ర్యాంకు, జి.సంతోష్ 2004వ ర్యాంకు, ఎం.వెంకట ఆకాష్ 2091, బి.యశ్వంత్‌బాబి 2417, బి.సాయిశ్రీధన్‌రెడ్డి 2,870, సిహెచ్.శశిజ్ఞానకౌశిక్ రెడ్డి 2,950, కె.ఆశ్రిత 3,426, సిహెచ్.నరసింహతేజ 3,651, వై.వెంకటభరత్‌కుమార్ రెడ్డి 4,957వ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. వెయ్యి ర్యాంకులలోపు 18 మంది, 5వేలలోపు ర్యాంకులు 73మంది, పదివేల లోపు ర్యాంకులు 118 మంది, 20వేల లోపు ర్యాంకులు 226మంది, 30వేల లోపు ర్యాం కులు 325 మంది సాధించారన్నారు. ఈ కార్యక్ర మంలో కోర్‌డీన్‌లు, డీన్‌లు, ఏజీఎంలు, ప్రిన్సి పాళ్లు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓవెల్‌కు ఉత్తమ ఫలితాలు



జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఓవెల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ ఆర్.వేణు తెలిపారు. నగరంలోని కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎం.వెంకటసుధాహేమంత్ 99.43, ఇ.కృష్ణవంశీ 98.52, వై.వి.చరణ్‌తేజ 98.61, ఎస్‌డీ.అఫ్జల్ షరీఫ్ 98.26, వి.బాలహర్షిత 98.02 పర్సంటైల్ సాధించారన్నారు. అలాగే ఎ.దుర్గాహనుమత్‌ప్రసాద్ 97.43, ఆర్.యశ్వంత్ 94.81, బి.అవినాష్ 94.20, సిహెచ్.యశ్విత 93.22, ఎ.సాయిదుర్గాచరణ్ 91.57, ఎం.మోహనప్రియ 91.57, పఠాన్ లుక్‌మాన్ 91.39



● 'విశ్వసాయి' విజయం

తమ కళాశాల విద్యార్థులు 57 మందికిపైగా జాతీయ స్థాయిలో విజయాలు సొంతం చేసుకున్నారని విశ్వసాయి కళాశాల చైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ తెలిపారు. శనివారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పి.రామ్‌రుత్విక్ 208, ఎం.శ్రావణ్ కుమార్‌రెడ్డి 356వ ర్యాంకుతో పాటు 9 మంది 90 పర్సంటైల్ కంటే అధికంగా సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

సాధించారన్నారు. 18 మంది 91 పర్సంటైల్‌కు పైగా సాధించి 50 మందికిపైగా విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ ప్రమీల, జీఎం మహదేవన్, ఈడీ బాలు, ఏజీఎం గంగాధర్, టీమ్ లీడర్ సుధీర్, ఎగ్జిక్యూటివ్ ఇన్‌చార్జి ఎఎం.విద్య, సిబ్బంది పాల్గొన్నారు.

● కృష్ణచైతన్య

జేఈఈ మెయిన్స్‌లో కృష్ణచైతన్య కళాశాల ఐన్‌స్టీన్ క్యాంపస్ విద్యార్థులు ఉత్తమ పర్సంటైల్స్‌తో హవా సృష్టించారని ఆ విద్యా సంస్థల చైర్మన్ ఆర్‌వీ.కృష్ణారెడ్డి, డైరక్టర్ రాణా ప్రమోద్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడారు. నిర్మల్‌తేజ 274వ ర్యాంకు, కె.అభినవ్‌రెడ్డి 98.75 పర్సంటైల్, ఎండి.ఆస్మోల్‌సైఫి 98.23 పర్సంటైల్, పి.సాయికేతన్‌రెడ్డి 96.76 పర్సంటైల్, కెమౌనిక 96.44 పర్సంటైల్ సాధించారన్నారు. అలాగే 40 మంది విద్యార్థులు అడ్వాన్స్‌కు అర్హత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల డీన్ శిరీష్‌బాబు, అకడమిక్ డీన్ రామ్‌గోపాల్‌రెడ్డి, అడ్మిన్ డీన్ రమేష్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



● శ్రీచైతన్య విజయభేరి

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారని డీన్ జి.శ్రీరామ్ తెలిపారు. నగరంలోని కళాశాల ప్రాంగణంలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కెజే.స్వరూప్ 470వ ర్యాంకు, ఎం.సౌమ్యశ్రీ 5123, ఎస్.వీ.ఉషాశ్రీ 10,444, బి.దినేష్ 13,937, కె.పవన్ 14,707వ ర్యాంకు సాధించారన్నారు. వివిధ కేటగిరిల్లో వెయ్యిలోపు ఒకరికి, 5వేల లోపు 4 మంది విద్యార్థులు, పదివేల లోపు 12 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



C.R.I.M.E N.E.W.S

కత్తులు, మారణాయుధాలతో

దొరికితే జైలుకే...

● నగర డీఎస్పీ సింధుప్రియ

● నెల్లూరులో కొనసాగుతున్న పోలీసుల తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న చిన్నబజారు పోలీసులు

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 18 (ఆంధ్ర జ్యోతి): కత్తులు, మారణాయుధాలతో ఎవరైనా దొరికితే, వారి జీవితం జైలు పాలవుతుందని నగర డీఎస్పీ పీ సింధుప్రియ హెచ్చరించారు. నగరంలో శుక్రవారం రాత్రి డీఎస్పీ ఆధ్వర్యంలో అన్నీ పోలీసు స్టేషన్ల పరిధిలో అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారణాయుధాలు కలిగి ఉన్న వారిపై ఆర్మ్స్ యాక్ట్ కేసులు కట్టి జైలుకు పంపుతున్నామన్నారు. అధిక శబ్దాలు చేస్తూ ప్రయాణించే వాహనాలను ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. వాహనదారులు ఒరిజనల్ సైలెన్సర్లనే ఉపయోగించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన, స్నేహితులు, వారి కదలికలను గమనిస్తూ ఉండాలని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిబుల్ రైడింగ్, పత్రాలు లేని వాహనాలు, నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై నిత్యం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుంటామని తెలిపారు. ఎవరైనా అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రహదారులపై బహిరంగంగా మద్యం సేవిస్తూ మహిళలు, దంపతులు, బాలలు, బాటసారులపై బెదిరింపులకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అయ్యప్పగుడి సమీపంలోని ఓ టిఫిన్ సెంటర్ వద్ద ఓ వ్యక్తిని అందరూ చూస్తుండగానే కత్తితో పొడిచి హత్య చేసిన వ్యక్తిని వేదాయపాలెం పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు, వేదాయపాలెంకు చెందిన అల్లాభక్షు(47) టెంపో ట్రావెల్స్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు.ఈనెల 16వతేదీ రాత్రి ఆయన ఇంటికి టిఫిన్ తీసుకెళ్లేందుకు అయ్యప్పగుడి సమీపంలోని భగవాన్ టిఫిన్ సెంటర్‌కు వెళ్లాడు. ఇంతలో రంగనాయకులపేట గొల్లవీధికి చెందిన షేక్ ఇషాక్ ఫూటుగా మద్యం సేవించి అక్కడికి వచ్చారు. టిఫిన్ విషయంలో వారిద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఆవేశంతో ఇషాక్ తన వద్ద ఉన్న కత్తితో అల్లాభక్షు ఛాతిలో పొడిచాడు. గాయాలపాలైన ఆయన్ను స్థానికులు వైద్యశాలలో చేర్పించారు. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య సుభహాని ఫిర్యాదు మేరకు వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వేదాయపాలెం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రోశయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం నిందితుడి కోసం గాలింపు చేపట్టి శుక్రవారం రాత్రి తిక్కనపార్కు సమీపంలో అరెస్ట్ చేశారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నగరంలోని భగత్‌సింగ్‌కాలనీలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు, భగత్‌సింగ్ కాలనీకి చెందిన చెంగయ్య(32), నాగభూషణమ్మ దంపతులు. వారికి ఇద్దరు సంతానం. చెంగయ్య బుచ్చిలోని చేపల ఫ్యాక్టరీలో క్యాచింగ్ పనులు, భార్య రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. చెంగయ్య మద్యానికి బానిసై అప్పులపాలయ్యాడు. ఈ విషయంలో భార్యభర్తల మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 18న భార్య తన పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. మనస్తాపానికి గురైన చెంగయ్య ఇంట్లోని ఇనుపదూలానికి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి ఇంట్లో నుంచి పెద్దగా టీవీ శబ్దం వస్తుండటంతో పక్కింటి వారం లోపల ఎవరున్నారని పలుమార్లు అడిగినా స్పందించక పోవడంతో భార్యకు ఫోన్ చేసి విషయం తెలిపారు. నాగభూషణమ్మ ఇంటికి వచ్చి చూడగా భర్త చీరకు వేలాడుతూ కన్పించాడు. ఈ మేరకు బాధితురాలు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ శివయ్య సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. వైద్యులు శవపరీక్ష నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి



వైద్యశాల వద్ద సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కావలి రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వేసవిలో అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని పలు ప్రయివేటు వైద్యశాలల్లో అగ్ని ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడుతూ వైద్యశాలల్లో ఎక్సింగ్ విషర్ సిలిండర్‌లు అందుబాటులో ఉంచకోవాలని, దాని వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ జి. ప్రభాకర్, అగ్నిమాపక సిబ్బంది, డాక్టర్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిపై దాడి

● బంగారం, నగదు దోపిడీ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు వృద్ధుడిపై దాడి చేసి అతడి వద్ద ఉన్న బంగారు ఉంగరం, నగదు దోచుకెళ్లారు.ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, నగరంలోని ఇస్కాన్ సిటికి చెందిన సుధాకర్‌రెడ్డి (65) శనివారం ఆత్మకూరు బస్టాండు వద్దకు వచ్చాడు. అక్కడ తెలిసిన వారితో మాట్లాడి, బాలాజీనగర్ గౌడ హాస్టల్‌కు నడిచి వెళ్తుండగా ఆయన్ను ఇద్దరు వెంబడించారు. గుడి వద్దకు రాగానే అడ్డగించి కత్తితో బెదిరించి, సమీపంలోని సర్వేపల్లి కాలువ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అతనిపై దాడిచేసి చేతికున్న అరుగ్రాముల ఉంగరం, రూ.2వేల నగదు దోచుకున్నారు. వృద్ధుడు ప్రతిఘటించడంతో దాడి చేశారు. స్థానికులు రావడాన్ని గమనించి నిందితులు పరారయ్యారు. బాలాజీనగర్ పోలీసులు బాధితుడి నుంచి వివరాలు సేకరించి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. నిందితుల్లో ఒకరు పాతనేరస్థుడని తెలిసింది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	105
స్కిన్ చికెన్	194
స్కిన్‌లెస్	214

కోడిగుడ్ల ధర (100): 420

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని బట్వాడి పాళెం సెంటర్‌లో శనివారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మందాబాబ్జి, నాయకులు పూడి ఆనంద్, ఏవీ రమణయ్య, చోటిబాయ్, మంద పెద్దబాబు, గంగపట్నం సురేష్ తదితరులు పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

భార్యపై దాడిచేసిన భర్తపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : భార్య, మామపై దాడిచేసిన భర్తపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు, నగరంలోని ఉమ్మారెడ్డిగుంటకు చెందిన సమీన్‌కు కోట మిట్టకు చెందిన అప్సర్‌తో 2024లో వివాహం జరిగింది. వివాహమైన కొద్దిరోజులకే భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. భార్య ఫిర్యాదు మేరకు అప్సర్‌పై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. భర్త నుంచి విడిపోయేందుకు ఆమె ఖాజీ కోర్టులో దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 10వతేదీ రాత్రి ఆమె తన తండ్రి గౌస్‌బాషాతో కలిసి కోర్టుకు వెళ్లారు. అక్కడ భార్య, మామపై అప్సర్ దాడి చేశాడు. గాయాలపాలైన సమీన్, గౌస్‌బాషాలు వైద్యశాలలో చికిత్స పొందారు. ఈ మేరకు బాధితురాలు శనివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శాంతి భద్రతలకు భంగం కలగకుండా చూడండి

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పోలీసులు జిల్లాలో శాంతి భద్రతలకు భంగం కలగకుండా చూడాలని సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు అలీషేర్ కోరారు. శనివారం సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మత స్వేచ్ఛనే దుర్వినియోగం చేస్తూ సోషల్ మీడియాలో వైరల్ మెసేజ్‌లు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయని పేర్కొన్నారు. మతాల మధ్య ద్వేషం కలిగిస్తున్న, సోషల్ మీడియా, మతోన్మాద సంఘాల వారి వెనుక ఉన్న ఉగ్రవాద సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

23న ఘంటసాల వర్ధంతి

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టౌన్‌హాలులో ఈనెల 23వతేదీ సాయంత్రం పద్మశ్రీ ఘంటసాల 51వ వర్ధంతి, ప్రముఖ గాయకులు డాక్టర్ కాకివాయి జశ్వంతి వర్ధంతిని నిర్వహించనున్నట్లు ఘంటసాల కళానికేతన్ అధ్యక్షుడు కోడూరు అనంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జరిగే సంగీత విభావరిలో పాటూరు శ్రీనివాసులు, ఆయన శిష్య బృందం పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఘంటసాల అభిమానులు, దాతలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

నేడు నిరసన

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమబంగాల్‌లో మతోన్మాదుల దాడులకు నిరసనగా ఆదివారం సాయంత్రం 5.30గంటలకు గాంధీబొమ్మ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఛత్రపతి శివాజీ సేన నెల్లూరు శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. మతోన్మాదవాదుల దాడిలో ముగ్గురు హిందువులు చనిపోయారని, పశ్చిమ బంగాల్ ప్రభుత్వాన్ని రద్దు చేసి, రాష్ట్రపతి పాలన విధించాలని నిరసన కార్యక్రమంలో డిమాండ్ చేస్తామని పేర్కొంది. హిందువులంతా తరలిరావాలని పిలుపునిచ్చింది.

నేడు విద్యుత్ అంతరాయం

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని బీవీ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతులు చేస్తున్నందున ఆదివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాగుంట లేఅవుట్, లెక్చరర్స్ కాలనీ, కొండాయపాళెం గేట్, వనంతోపు సెంటర్లలో సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

రవీంద్రభారతిలో కిడ్స్ కాన్వొకేషన్



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో స్కూల్ యాజమాన్య ప్రతినిధులు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నవాబుపేట రవీంద్ర భారతి పాఠశాలలో శనివారం కిడ్స్ కాన్వొకేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్‌లు, బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో డాక్టర్ పీ.బిందు. పాఠశాల జోనల్ ఇన్‌చార్జి శ్రీహరి, డీన్ పీ.శ్రీనివాసులరెడ్డి, హెచ్ఎం నిరుపమ, అకడమిక్ ఇన్‌చార్జి రేష్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

అనంతసాగరం ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కామిరెడ్డిపాడు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శనివారం ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను తల్లితండ్రులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం వసుంధరాదేవి, సీఆర్‌పీ మాధవ, మనోజ్ పాల్గొన్నారు.

బోర్లు వేసి ఏళ్లు గడుస్తున్నా కనెక్షన్లు ఇవ్వలేదు

● ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ల చోరీలతో రైతుల బెంబేలు ● రూరల్ మండల సమావేశంలో సభ్యుల ఏకరువు

నెల్లూరురూరల్, ఏప్రిల్ 19,(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో దాహార్తి తీర్చేందుకు బోర్లు వేసి ఏళ్లు గడుస్తున్నా, మోటార్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదని నెల్లూరు రూరల్ మండల సమావేశంలో సభ్యులు పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బీ. విజయకుమార్ అధ్యక్షతన జరిగిన జరిగిన సమావేశంలో ఎంపీటీసీ, సర్పంచులు మాట్లాడారు. ఉప్పుటూరులో బోర్లు వేసినా ఇప్పటికీ కనెక్షన్ ఇవ్వలేదని సర్పంచి సుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయని, అవి పూర్తయితే చిన్నారులకు మేలు జరుగుతుందని మరి కొంత మంది సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పేదలకు ఇంటి స్థలం విస్తీర్ణం పెంచాలని, అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందచేయాలని సూచించారు. కాగా విజిలెన్స్ విచారణలో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన ఇళ్లకు బిల్లులు మంజూరు కష్టమని, ఆర్ఆర్ బిల్డర్స్, కాంట్రాక్టర్ సుబ్బారెడ్డిలకు ఆక్షేపణ నోటీసులను జారీ చేశామని, మిగిలిన ప్రాంతాలలోని ఇళ్లను నిర్మించుకుంటే బిల్లులు ఇస్తామని ఏఈ మనోజ్ తెలిపారు. జూలై నుంచి నరసింహకొండ, నగరవనం ప్రాంతాల్లో ఉచిత మొక్కల పంపిణీ ఉంటుందని అటవీశాఖ అధికారులు తెలిపారు. గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ మోటార్ల దొంగతనాలు వరుసగా జరుగుతున్నాయని, దీంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా ఈ సమావేశానికి రెవెన్యూ, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, వెటర్నరీ, పోలీసుశాఖల ఎవరూ హాజరు కాకపోవడంపై సభ్యులు అభ్యంతరం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శైలేంద్రకుమార్, జడ్పీ కోఆప్షన్ సభ్యులు అల్లాభక్షు, వైస్ ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛాంధ్రపై అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీపీ విజయకుమార్

ప్రజా సేవకుడు వీపీఆర్ : రూరల్ ఎమ్మెల్యే



వీపీఆర్ జన్మదినం సందర్భంగా వీపీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరం



వీపీఆర్ దంపతులకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న రూప్‌కుమార్ తదితరులు

నెల్లూరురూరల్, ఏప్రిల్ 19,(ఆంధ్రజ్యోతి) : పేదలకు సేవ చేయాలన్న తపన కలిగిన వ్యక్తి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. వీపీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం తన కార్యాలయంలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియోజకవర్గంలో బుజబుజనెల్లూరు, కనుపర్తిపాడుల వద్ద జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ వంతెనల నిర్మాణానికి వీపీఆర్ కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా బదిలీ అయిన కమిషనర్ సూర్యతేజను కోటంరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

● **నెల్లూరు (వైద్యం) :** ఎంపీ వేమిరెడ్డి పుట్టినరోజు వేడుకలు టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగాయి. ముదిరాజ్ సాధికారిత సమితి కన్వీనర్ పీఎల్‌రావు ఆ ధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు జన్ని రమణయ్య, మామిడాల మధు, ఊరందూరు సురేంద్రబాబు, పనబాక భూలక్ష్మి, దొడ్డపనేని రాజానాయుడు, పాలిశెట్టి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● **నెల్లూరు (హరనాథపురం) :** ఎంపీ వీపీఆర్ జన్మదిన వేడుకలు టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఆధ్వ ర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. నగ రంలోని మూలాపేట, వీఆర్సీ, నర్తకి సెంటర్, మినిబైపాస్ పూలే విగ్రహ సెంటర్‌లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నుడా మాజీ చైర్మన్ ద్వారకానాథ్, ఉడాలి సూర్య నారాయణ, పోలీసు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌రావు, సిద్దు సుబ్బారెడ్డి, శిరీష్‌రెడ్డి, సునంద, కుసుమ, ఝాన్సీ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అట్టహాసంగా వీపీఆర్ జన్మదిన వేడుకలు

● ఎంపీ వేమిరెడ్డి జన్మది నోత్సవం సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చే శారు. ప్రజలు, నేతలు, యువత భారీగా తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. టీడీపీ ముఖ్య నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణచైతన్య, కోడూరు కమలాకర్‌రెడ్డి, వంశీరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, వీరేంద్రనా యుడు, గుడి హరిరెడ్డి తదితరులు రక్తదానం చేశారు. వారందరికీ రెడ్‌క్రాస్ ఛైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి ధ్రువీకరణ పత్రాలు అంద చేశారు.ఈ కార్యక్రమంలో బుచ్చి నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

● ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలను శనివారం తిరుపతిలోని తాజ్‌హోటల్‌లో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తన మిత్రబృందంతో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వేమిరెడ్డిని గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు దార్ల వెంకటేశ్వర్లు, కలికి శ్రీధర్‌రెడ్డి, నిశ్చల్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్ పాల్గొన్నారు.



పేదలకు అన్నం వడ్డిస్తున్న కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులు



పేదలకు చీరలను పంపిణీ చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

వైభవంగా మహాపట్టాభిషేకం



మహాపట్టాభిషేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలాజీనగర్ సీతారామ మందిరంలో శనివారం రాత్రి శ్రీరామ మహాపట్టాభిషేకం అలంకారం జరిగింది. ఈ సందర్భంగా ఉదయం అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. సాయంత్రం పూలంగిసేవ, విశేష పూజలు జరిగాయి. ఉభయ దాతలుగా కృష్ణగిరి దేశ్‌పాల్‌సింగ్, దేవకీదేవి వ్యవహరించారు. ఈ కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ ఛైర్మన్ అమరా మోహన్‌రావు, ఆలయ పాలక మండలి అధ్యక్షుడు తన్నీరు మస్తాన్‌రావు, కార్యదర్శి సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి కొప్పరపు శివప్రసాద్, ధర్మకర్తలు, త్యాగరాజ కల్యాణ మండపం పాలక వర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ విద్యార్థులకు అభినందన

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 19,(ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఇంటర్‌లో ఉత్తీర్ణులైన మున్సిపల్ కళాశాల విద్యార్థులకు ఎన్ఎంసీ మేయర్ స్రవంతి శనివారం అభినందనలు తెలిపారు. ఎన్ఎంసీలోని తన ఛాంబరులో ఆమెను వారంతా మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపిన ఆమె మాట్లాడారు. ఇంటర్ ఫలితాల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులైయ్యారని, దీని వల్ల రానున్న కాలంలో మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా చదివి మున్సిపల్ కళాశాల సత్తాచాటరని ప్రశంసించారు.



ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన మున్సిపల్ కళాశాల విద్యార్థులను అభినందించిన నగర మేయర్ స్రవంతి తదితరులు

కేంద్రమంత్రికి అవార్డుపై అభినందన



కేంద్రమంత్రి రామ్మోహన్ అభినందన సదస్సులో వాకర్స్ అసోసియేషన్ నేతలు

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర విమానయాన మంత్రి కే. రామ్మోహన్‌నాయుడుకు ప్రపంచ ఆర్థిక వేదిక యంగ్ గ్లోబల్ లీడర్ అవార్డుకు ఎంపిక చేయటం ఎంతోగర్వంగా ఉందని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి చంద్ర అబ్బయ్యనాయుడు అన్నారు. శనివారం స్మైల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో అభినందన సభ జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే ఇలాంటి అవార్డు దక్కించుకున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఎంతో అభినందనీయులన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మదార్‌బాయ్, సభ్యులు రాఘవరెడ్డి, భక్తవత్సలరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, రామానాయుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనాథుడి కవిత్వం రమణీయం

నెల్లూరు (సాంస్కృతికం) (ఆంధ్రజ్యోతి) : కవిసార్వభౌమ శ్రీనాథుడి కవిత్వం రమణీయమని విశ్రాంత సీనియర్ పోస్టల్ సూపరింటెండెంట్ సీహెచ్‌వీ బృందావనరావు పేర్కొన్నారు. చేతన సంగీత, సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నగరంలోని టౌన్‌హాలు వర్ధమాన సమాజం రీడింగ్ రూమ్‌లో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. శ్రీనాథుడు రసప్రసిద్ధ ధారాశుద్ధికి, సూక్తి వైచిత్రికి, ప్రౌఢ కవనానికి పెట్టిందిపేరని తెలిపారు. కార్యక్రమంలో నలుబోలు బలరామయ్య నాయుడు, చేతన కార్యదర్శి వై.శేషగిరీశం, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర



వైద్యశాఖ కార్యాలయ ప్రాంగణంలో శుభ్రం చేస్తున్న డీఎంహెచ్‌వో, ఇతర వైద్యులు, సిబ్బంది



పోలీసు కార్యాలయంలోని ఈ వేస్ట్‌ను డిస్‌ప్లే చేసిన పోలీసు అధికారులు

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : డీఎంహెచ్‌వో కార్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాతతోపాటు పలువురు వైద్యులు సిబ్బంది పాల్గొని పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, వైద్యాధికారులు డాక్టర్ రమేష్, డాక్టర్ యశ్వంత్, డాక్టర్ భాస్కర్, డాక్టర్ బ్రంహేశ్వరనాయుడు, మంజుల, బాలాజీ, ఏవో నిశాంత్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● **నెల్లూరు(క్రైం, ఆంధ్రజ్యోతి) :** జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వ్యర్థాలు శాస్త్రీయ పద్ధతిలో ఎలా డిస్పోజ్ చేయాలనే అంశంపై పోలీసు అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేయడంతో పాటు అవగాహన కల్పించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్రపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్ మాట్లాడారు. జిల్లా పోలీసు కార్యాలయంలో 57 మానిటర్స్, 69 మెమోరి హార్డ్ డిస్కులు, కీ బోర్డులు, ప్రింటర్స్, స్టేబిలైజర్స్, కాట్రిడ్జిలు ఈ వేస్ట్‌గా నిర్ధారించి డిస్‌ప్లే చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

● **నెల్లూరు (జడ్పీ, ఆంధ్రజ్యోతి):** జిల్లా పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహిం చారు. సీఈవో విద్యారమ, ఎస్ఈ వెంకట రమణ ఈ కార్యక్రమంలో పాల్గొని పరిశుభ్ర తపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కార్యాల యంలో పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించారు. కార్యక్రమంలో జడ్పీ, గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు. అలాగే జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నోడల్ అధికారి కే, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రికల్ వస్తువులను సేకరించి నిర్వీర్యం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈలు,డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

● **నెల్లూరు(స్టోన్ హౌస్‌పేట), (ఆంధ్రజ్యోతి) :** నగరంలోని రంగనాయకుల పేటలో జనసేన నాయకులు శనివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు నూనె మల్లికార్జున మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వచ్ఛభారత్‌ను బాధ్యతగా చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్షాచలం రాజేష్, దాసరి పోలయ్య, వెంకట్ తల్లూరి, పవన్, తదితరులు పాల్గొన్నారు.

● **నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి) :** స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలని ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు అన్నారు. నగరంలోని డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఈ వేస్ట్‌పై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఈ వేస్ట్‌పై వీడియో ప్రదర్శన నిర్వహించారు. అనంతర విద్యార్థినులు, సిబ్బంది స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొండయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



సుదీర్ఘ నిరీక్షణకు తెర

నేడు డీఎస్సీ నోటిఫికేషన్


ఉమ్మడి చిత్తూరు జిల్లాలో భర్తీ కానున్న 1478 టీచర్ పోస్టులు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ళ తరబడి టీచర్ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న డీఎస్సీ అభ్యర్థుల నిరీక్షణ ఫలించింది.డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఆదివారం ప్రభుత్వం విడుదల చేయనుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో దాదాపు 1478 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనుంది. ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ, వ్యాయామ) 1473 పోస్టులు భర్తీ చేయనుండగా, ట్రైబల్ వెల్ఫేర్ (ఆశ్రమ) పాఠశాలల్లో మరో ఐదు పోస్టులు(మ్యాథ్స్ 1, ఫిజిక్స్ 1, బయాలజీ 1, ఎస్జీటీ 2)తో కలుపుకుని మొత్తంగా 1478 టీచర్ పోస్టులు భర్తీ కానున్నాయి. జూన్ 6వ తేదీ నుంచి జులై 6వ తేదీ వరకు సబ్జెక్టుల వారీగా డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తారు.టీచర్ ఖాళీల భర్తీతో ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య తగ్గే అవకాశాలు ఉన్నాయి.

గతేడాది నవంబరులోనే టెట్ ఫలితాలు

మెగా డీఎస్సీ ప్రకటిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అందుకు అనుగుణంగా గతేడాది జూలైలో టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు (టెట్) పరీక్షలు నిర్వహించి, ఫలితాలను నవంబరు మొదటి వారంలో విడుదల చేసింది. చిత్తూరు జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలు, ఇతర ప్రాంతాలకు చెందిన 6876 మంది పరీక్షలు రాసారు. టెట్‌లో అర్హత సాధిస్తేనే డీఎస్సీ రాయడానికి అర్హులవుతారు.

విభాగం	ఖాళీ పోస్టుల సంఖ్య
ఎస్జీటీ	976
ఎస్ఏ తెలుగు	38
ఎస్ఏ హిందీ	17
ఎస్ఏ ఇంగ్లీష్	104
ఎస్ఏ మ్యాథ్స్	30
ఎస్ఏ ఫిజిక్స్	29
ఎస్ఏ బయాలజి	63
ఎస్ఏ సోషల్	130
ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్	86
ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలు	5
మొత్తం	1478



నాయకుడు పుట్టడు. తయారవుతాడు. పరిస్థితులు తయారు చేస్తాయి. నిచ్చెనలు వేస్తాయి. అందుకోవడమే చాతుర్యం. నేపథ్యమూ, సంపదా అదనపు చేర్పు మాత్రమే. కృషి, పట్టుదల, ఓర్పు, ప్రజలతో మమేకమయ్యే గుణం.. ఇవీ ముఖ్యం. వీటన్నింటినీ పుణికిపుచ్చుకున్న వాడు నారా చంద్రబాబు నాయుడు. ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయ చరిత్రలో ఎన్నటికీ చెరగని సంతకం. ఈ రైతుబిడ్డ రాజకీయ ప్రస్థానంలో ప్రతి మలుపూ ఒక ఆశ్చర్యం.. అవకాశాలను వెతుక్కుంటూ వెళ్లిన తీరు అద్భుతం! నేడు 75వ పుట్టినరోజు జరుపుకుంటున్న చంద్రబాబుకు జిల్లా ప్రజల జేజేలు!

కుప్పం చంద్రుడు.. దటీజ్ చంద్రబాబు! 6వ పేజీలో

బంగారు భవిష్యత్తుకు దిక్సూచి

- 30స్టాల్స్ ఏర్పాటు చేసిన ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు
- ప్రారంభానికి ముందునుంచే పోటెత్తిన విద్యార్థులు
- పిల్లలతో సహా తరలివచ్చిన తల్లిదండ్రులు
- నేడు కూడా కొనసాగనున్న ఆంధ్రజ్యోతి ఎడ్యుకేషన్ ఎక్స్‌పో

తిరుపతి(విద్య/రూరల్), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ తర్వాత ఏయే కోర్సులు అందుబాటులో ఉంటాయి? ఏ విభాగంలో ప్రొఫెషనల్ విద్యను ఎంచుకోవాలి? ఏ విద్యాసంస్థలో చేరాలి? ఎంచుకున్న విద్యాసంస్థల్లో సీటు పొందడం ఎలా? ఫీజులెలా ఉంటాయి? ఇలాంటి సందేహాలను అప్పటికప్పుడే నివృత్తి చేసి విద్యార్థులకు దిశానిర్దేశం చేసి పెద్దలకు ఊరటనిచ్చే దిక్సూచిలా నిలచింది ఆంధ్రజ్యోతి-ఐఆర్ఎంఎస్(ఇంటిగ్రేటెడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్) ఎడ్యుకేషన్ ఎక్స్‌పో. రెండు రోజుల పాటు తిరుపతిలో నిర్వహించనున్న ఎక్స్‌పో శనివారం ఉదయం ఎయిర్ బైపాస్ రోడ్డులోని పీఎల్ఆర్ కన్వెన్షన్ హాల్లో ప్రారంభమైంది. విద్యా ప్రముఖులు జ్యోతి ప్రజ్వలనతో ఎక్స్‌పోను ప్రారంభించారు. ప్రముఖ విద్యాసంస్థ అపోలో యూనివర్సిటీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నరేశ్‌కుమార్‌రెడ్డి రిబ్బన్ కత్తిరించగా రాజలక్ష్మి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్ర, తెలంగాణా అడ్మిషన్స్ హెడ్ రమ్యకృష్ణ, టర్న్‌కీ ఈవెంట్స్ సీఈవో రాధాకృష్ణన్, ఐఆర్ఎంఎస్ ఫౌండర్ అండ్ సీఈవో రాజ.సి, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు, బ్రాంచ్ మేనేజర్ సురేష్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఎక్స్‌పోను ప్రారంభించారు.



ఎడ్యుకేషన్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న అపోలో యూనివర్సిటీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నరేష్‌కుమార్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు, బ్రాంచ్ మేనేజర్ సురేష్‌రెడ్డి, విద్యా సంస్థల ప్రతినిధులు

● ఎక్స్‌పో వైపే అందరి అడుగులు : శనివారం ఉదయం 11 గంటల సమయంలో ఎడ్యుకేషన్ ఎక్స్‌పో ప్రారంభం కాగా అంతకు ముందు నుంచే విద్యార్థులు పోటెత్తారు. బిడ్డలతో తరలివచ్చిన తల్లులు, తండ్రులు కొందరైతే స్నేహితులతో వచ్చిన విద్యార్థులు మరికొందరు. కొన్ని కళాశాలల అధ్యాపకులు కూడా తమ విద్యార్థులను ఎక్స్‌పోకు తీసుకువచ్చారు. దీంతో పీఎల్ఆర్ కన్వెన్షన్ హాల్ విద్యార్థులు, పెద్దలతో నిండిపోయింది. విద్యాసంస్థల సహాయ కేంద్రాలు కిక్కిరిసిపోయాయి. తమకు కావాల్సిన కోర్సులు అందించే విద్యాసంస్థలకు చెందిన స్టాళ్లకోసం ఎక్స్‌పోలో ఆసక్తిగా వెతికారు. ఆయా స్టాళ్లలోని ప్రతినిధులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బ్రోచర్లు తీసుకున్నారు. అందులోని కోర్సుల వివరాలను చదువుతూ వాటి గురించి చర్చించుకుంటూ లక్ష్యం నిర్దేశించుకునేందుకు మార్గం చిక్కిందన్న భరోసాతో ఇంటికి మళ్లారు. ఎక్స్‌పో రాత్రి 7గంటల వరకు కొనసాగింది. ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ఎక్కడో దూరానవున్న అవకాశాలన్నింటినీ పోగుచేసి విద్యార్థులకు అందించిన ఆంధ్రజ్యోతి-ఐఆర్ఎంఎస్ ఎక్స్‌పోకు మొదటిరోజు విశేష ఆదరణ లభించింది. ఆదివారం కూడా ఎక్స్‌పో కొనసాగనుంది.

జేఈఈ మెయిన్స్‌లో జయకేతనం

● మెరుగైన ర్యాంకులతో మెరిసిన విద్యార్థులు



ఎం.భానుచరణ్‌రెడ్డి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్-2 ఫలితాలు వెలువడ్డాయి. శుక్రవారం అర్ధరాత్రి దాటాక ప్రకటించిన ఈ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభచాటారు. ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు ఈనెల 2 నుంచి 9వ తేదీ వరకూ ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఓపెన్ కేటగిరీలో శ్రీకాళహస్తికి చెందిన ఎం.భానుచరణ్‌రెడ్డి 99.99 పర్సంటైల్‌తో 158వ ర్యాంకు పొందారు. 99.98 పర్సంటైల్‌తో తిరుపతికి చెందిన మణిదీప్‌రెడ్డి 274, మహేష్ 298, కృష్ణవంశీ 331 ర్యాంకులు సాధించారు. 99.98 పర్సంటైల్‌తో చిత్తూరుకు చెందిన నిఖిల్ 386, తిరుపతికి చెందిన జశ్వంతి 458వ ర్యాంకు పొందారు. 99.97 పర్సంటైల్‌తో చిత్తూరుకు చెందిన ధనుష్ 466, 99.97 పర్సంటైల్‌తో అనంతపురం పెనుగొండకు చెందిన హిమేష్ రాఘవచంద్ర 502వ ర్యాంకు సాధించారు. ఈడబ్ల్యూఎస్ విభాగంలో 99.938 పర్సంటైల్‌తో పూర్వపు ఉమ్మడి జిల్లా తంబళ్లపల్లి మండలం కుక్కరాజపల్లి విద్యార్థి అరుణ్‌కుమార్‌రెడ్డి 82, వంశీకృష్ణారెడ్డి 98 ర్యాంకులు పొందారు. బాలికల విభాగంలో 99.90 పర్సంటైల్‌తో తిరుపతికి చెందిన యశ్విత 1535వ ర్యాంకు సాధించి గ్రేటర్ రాయలసీమలో టాప్ ర్యాంకర్‌గా నిలిచింది.



మణిదీప్‌రెడ్డి - మహేష్ - కృష్ణవంశీ - నిఖిల్ - జశ్వంతి



ధనుష్ - హిమేష్ రాఘవ చంద్ర - అరుణ్‌కుమార్‌రెడ్డి - వంశీకృష్ణారెడ్డి - యశ్విత

పట్టాలు తప్పిన గూడ్స్‌రైలు

బాలాయపల్లి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలం వెందోడు - నిడిగల్లు రైల్వేస్టేషన్ల మధ్యలోని జయంపు సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి తిరుపతి నుంచి విజయవాడ వైపు వెళుతున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. అడ్డుగా వచ్చిన గేదెలను రైలు ఢీకొనడంతో పట్టాలు తప్పింది. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే రైలును నిలిపివేశారు. ఈ ఘటనతో ఈ మార్గంలో కొంత సమయం పాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రైల్వే అధికారులు పట్టాలకు మరమ్మతులు చేపట్టి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ఘటనలో దాదాపు 10 గేదెలు చనిపోయినట్లు తెలుస్తోంది.






1989కి ముందు

అడవుల్లో అవస్థల దారులు.. పల్లెలకు ఎద్దుల బండి బాటల వంటి డొంక దారులు.. నియోజకవర్గం మొత్తం రెండే రెండు హైస్కూళ్లు.. ఒక్కటే జూనియర్ కాలేజీ. ఆపై చదవాలంటే కర్ణాటకకు పరుగులు.. సజ్జ, రాగి సంగటే ఆహారం. వస్తు మార్పిడితోనే వ్యాపారం. ఆరెంపీలదే వైద్యం.. ఏ ఉద్యోగికైనా కుప్పం ఒక పనిష్మెంట్ ప్రాంతం.

...చంద్రబాబు తన రాజకీయ కార్యక్షేత్రంగా కుప్పం ప్రాంతాన్ని ఎంచుకునే నాటికి ఉన్న పరిస్థితి ఇది.



చంద్రబాబు వచ్చాక

ఎటునుంచి ఎటు వెళ్లాల్సి వచ్చినా సిమెంటు రోడ్లు.. ద్రావిడ విశ్వవిద్యాలయం, వైద్య, ఇంజనీరింగ్ కళాశాలలు, ప్రతి గ్రామంలో బడులు.. అత్యాధునిక వ్యవసాయ పద్ధతులతో లాభసాటిగా మారిన వ్యవసాయం.. బేకరీలు, హోటళ్లు.. కుప్పంలో ఆగి కదిలే రైళ్లు.. రెక్కలు విప్పుకోబోతున్న విమానాశ్రయం.. చల్లని ఈ ప్రాంతం ఇప్పుడు ఉద్యోగులకు స్వర్గధామం.

... ఇప్పటికి 8 సార్లు కుప్పం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన నారా చంద్రబాబు నాయుడు చేసి చూపిన అభివృద్ధి ఇది.







75 ఏళ్ల కుప్పం చంద్రుడు

కుప్పం ఆంధ్రజ్యోతి

వ్యవసాయ విప్లవం


ఒకప్పుడు కుప్పం ప్రాంతంలో వర్షాధార వ్యవసాయమే సాగేది. సామలు, రాగులు లాంటి మెట్ట పంటలు వేసి ఆకాశంవైపు చూసే వారు రైతులు. వానలు కురిస్తే సరి, లేదంటే అప్పుల్లో మునిగిపోయే వారు. ఇటువంటి చోట.. ఇజ్రాయిల్ టెక్నాలజీతో వ్యవసాయంలో విప్లవం తీసుకొచ్చారు చంద్రబాబు. రామకుప్పం మండలం చెల్దిగాని పల్లె ఈ ప్రయోగాలకు వేదిక అయ్యింది. తక్కువ నీటితో అత్యధిక దిగుబడి సాధించడం ఇజ్రాయిల్ టెక్నాలజీతో సాధ్యం. సంప్రదాయ సాగుకే అలవాటు పడిన అప్పటి రైతులు తొలిరోజుల్లో ఆధునిక సాంకేతికతకు మొగ్గు చూపలేదు. ఫలితాలు చూశాక ఇప్పుడు ప్రతి రైతూ బిందు, తుంపర్ల సేద్యమే చేస్తున్నాడు. గ్రీన్ హౌస్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఇండో ఇజ్రాయిల్ భాగస్వామ్యంతో 22.8 ఎకరాల స్థలంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ, కూరగాయలు, పూలు)ను 2019లో రూ.9 కోట్ల వ్యయంతో కుప్పంలో ఏర్పాటు చేశారు.ఇక్కడ 19పాలీ హౌస్‌లు, ఒక ఫారం పాండ్, రెండు నీటి నిల్వ బ్యాంకులతోపాటు కోల్డ్ స్టోరేజీ రూము,విషింగ్/గ్రేడింగ్ యంత్రాలున్నాయి. ఉద్యాన రైతులకు ఎంతో ఉపయోగపడుతున్న సీవోఈకి గతేడాది ప్రతిష్ఠాత్మకమైన స్కోచ్ అవార్డు లభించింది.ఇక చెల్దిగానిపల్లె, కమతమూరు గ్రామాలలో ఉద్యాన రైతు సంఘాలను ఏర్పాటు చేసి రోజాలు, చేమంతులు, క్యాప్సికం, క్యాబేజీ, బీన్స్ రైతులనుంచి సేకరించి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసి లాభాలు గడిస్తున్నారు.తిరుమల ఆలయానికి సైతం పూలు, కూరగాయలు ఇక్కడి నుంచి సరఫరా అవుతున్నాయి. కుప్పానికి పట్టుగూళ్ల మార్కెట్టు కూడా వచ్చింది.శాంతిపురం మండలం నక్కనపల్లెలో రైతు లు పట్టు ఉత్పత్తిలో రాష్ట్రస్థాయి అవార్డులు కూడా పొందారు. నియోజకవర్గవ్యాప్తంగా నెలకు 150మెట్రిక్ టన్నుల బైవోల్టిన్ పట్టు గూళ్లు ఉత్పత్తవుతున్నాయి.

హంద్రీనీవాతో కృష్ణా నీళ్లు

ఈ ప్రాంతంలో ఒకప్పుడు చిన్నపాటి నీటి కుంటలు, చెరువులు తప్ప మరో సాగునీటి వ్యవస్థ లేదు. పాలారు నది నియోజకవర్గంలోనే ప్రవహిస్తున్నా వర్షాకాలంతో తప్ప ఎప్పుడూ నీళ్లుండేవి కావు. చంద్రబాబు సీఎం అయ్యాక పాలారు నదిపై చెక్ డ్యామ్‌లు నిర్మించారు. 2014-2019 నడుమ రూ.575 కోట్ల అంచనా వ్యయంతో హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కెనాల్ పనులకు శ్రీకారం చుట్టారు. 2019కి ముందే సుమారు 80 శాతం పనులు పూర్తయ్యాయి.అయితే మధ్యలో వైసీపీ అధికారంలోకి రావడంతో కాలువ పనులు దాదాపు ఆగిపోయాయి. మళ్లీ 2024లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాలువ లైనింగ్ పనులకు 97.7 కోట్లు మంజూరయ్యాయి. రామకుప్పం మండల పరిధిలో ఈ పనులు ప్రస్తుతం వేగవంతంగా సాగుతున్నాయి.ఈ కాలువ పూర్తయితే పలమనేరు-కుప్పం నియోజకవర్గాల పరిధిలోని 8 మండలాల్లో 110 చెరువులకు నీళ్లు చేరి, 6300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందుతుంది. అలాగే తాగునీటి సమస్య కూడా చాలా వరకు పరిష్కారమవుతుంది. మరోవైపు పాలారు మీద ఇప్పటికే ఉన్న చెక్ డ్యామ్‌ల పునరుద్ధరణకు కూడా నిధులు మంజూరయ్యాయి.

చదువుల కుప్పం ఆరోగ్యానికి భరోసా

ఒకప్పుడు కుప్పంలో, రామకుప్పం మండలం బందార్లపల్లెలో మాత్రమే జడ్పీ ఉన్నత పాఠశాలలు నడిచేవి. కుప్పంలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండేది. డిగ్రీ చదవాలంటే కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్‌కి వెళ్లాల్సిన పరిస్థితి. ఇక వైద్యం విషయానికి వస్తే కుప్పంలో ఆస్పత్రి ఉండేది కానీ, వైద్య సదుపాయాలు అంతంతమాత్రమే. ఆర్ఎంపీలు చేసే అరకొర వైద్యమే ప్రజలకు దిక్కు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత కుప్పం ప్రభుత్వాస్పత్రి అత్యాధునిక వైద్య సదుపాయాలతో కూడిన వంద పడకల ఆస్పత్రిగా మారింది. ప్రైవేటు యాజమాన్యంలో కార్పొరేట్ స్థాయిలో పీఈఎస్ వైద్య కళాశాల, ఆస్పత్రి ఏర్పాటయ్యాయి. మరోవైపు గ్రామానికి ఒకటిరెండు పాఠశాలలు స్థాపించారు. ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలలు ఇబ్బడిముబ్బడిగా వెలిశాయి. కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ప్రైవేటు యాజమాన్యంలో ఏర్పాటై సాంకేతిక విద్యను మప్పుతోంది. తాజాగా కుప్పం మండలం బైరుగానిపల్లెలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థలం కేటాయించారు.



బంగారు బాటలు

డొంక దారులు, బండి బాటలు.. ఇవే రహదారులంటే ఒకప్పుడు కుప్పంలో. చుట్టూ అడవి, మధ్యలో పల్లెలు, ఒక పల్లెనుంచి మరో పల్లెకు నడకదారులు. క్రూర మృగాల భయం. పలమనేరు నుంచి కుప్పం మీదుగా తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి ఒకేఒక సింగిల్ రోడ్డు. కుప్పం నడిబొడ్డున రైల్వే గేటు. దానికి ఇటూఇటూ బారులుతీరి నిలిచిపోయే వాహనాలు. తీవ్రమైన ట్రాఫిక్ సమస్య. చంద్రబాబు వచ్చాక ఫ్లై వోవర్ వచ్చింది. ట్రాఫిక్ సమస్య తగ్గింది. పలమనేరు-కృష్ణగిరి మధ్య రహదారి నాలుగు లేన్లుగా మారుతోంది. ప్రతి గ్రామానికి నాలుగు వైపులనుంచీ తారు, సిమెంటు రోడ్లు. ఎటు నుంచి ఎటు వెళ్లాలన్నా సాఫీగా సాగే ప్రయాణం. గ్రామగ్రామానా అంతర్గత సిమెంటు రోడ్లు, రక్షిత మంచినీటి సౌకర్యం. బెంగళూరు రాకపోకలు సాగించే ప్రతివొక్క ఎక్స్‌ప్రెస్ రైలు కుప్పంలో ఆగుతోంది. ఇక ఉద్యాన పంటల రవాణాకోసం అనుకున్న కార్గో ఎయిర్ పోర్టు, మరింత విస్తరించి డొమెస్టిక్ ఎయిర్ పోర్టుగా మారడానికి అంచనాలు తయారయ్యాయి. ఇప్పటికే స్థల సేకరణ పూర్తయింది.

'కడా'తో పక్కా అభివృద్ధి ప్రణాళిక

కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా)తో నియోజకవర్గ పక్కా అభివృద్ధి ప్రణాళిక తయారవుతోంది. కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ నేతృత్వంలో జీరో పావర్టీ దిశగా కార్యకలాపాలు సాగుతున్నాయి. పక్కా ఇళ్లకోసం నియోజకవర్గంలో 14,469 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వానికి జాబితా పంపారు. సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ విద్యుత్తు ప్రాజెక్టును కుప్పం మండలం నడిమూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇక్కడ ఇప్పటికే 75 శాతం సోలార్ విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచితంగా కనెక్షన్లు ఇస్తున్నారు. ఈ పథకాన్ని నియోజకవర్గం మొత్తం విస్తరించడానికి అవసరమైన కసరత్తు నడుస్తోంది.రాబోయే అయిదేళ్లలో కుప్పానికి పలు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు రానున్నాయి. దీని కోసం కడా ఇప్పటికే పునాది సిద్ధం చేసింది. అలీప్, మదర్ డెయిరీ, ఇ-రాయిస్, టెక్నాల్ ఎనర్జీ, కోవై క్లాసిక్ ఇండస్ట్రీస్, పౌ చెన్, అడిడాస్, యాసిక్స్, న్యూ బ్యాలెన్స్, సాలోమన్ అండ్ టిబర్ ల్యాండ్ తదితర కంపెనీలతో ఇప్పటికే ఎంఓయూలు కుదుర్చుకున్నారు.ఆయా కంపెనీలకు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో భూములను కేటాయించారు. ఇవిగాక ఈజీ మార్ట్, 1ఎం1బీల ద్వారా వ్యాపార, కెరీర్ గైడెన్స్ ఇస్తున్నారు. ఈ కంపెనీల ద్వారా సమీప భవిష్యత్తులో 30 వేల ఉద్యోగాలు కల్పించనున్నారు. మరోవైపు కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారీపై కసరత్తు నడుస్తోంది. సింగపూర్‌నుంచి వచ్చిన కన్సల్టెన్సీ ద్వారా సర్వే చేస్తున్నారు.యూజీడీ, అండర్ గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ, వాటర్ పైపులైన్లతోపాటు సమగ్రమైన అభివృద్ధి రెండేళ్ల కాలవ్యవధిలో పూర్తవుతుందని అంచనా. అలీప్ ద్వారా మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ప్రాజెక్టు సాగుతోంది.

క్రమశిక్షణకు, నిజాయితీకి మారు పేరుగా నిలిచిన పరిపాలనాదక్షుడు. ఎలాంటి సంక్షోభాలనైనా దీటుగా ఎదుర్కోగలిగే బహుముఖ ప్రజ్ఞాశాలి .. దశాబ్దల ముందే అభివృద్ధిని పసిగట్టే విజనరీ.. 75 ఏళ్ల తన జీవితంలో సుమారు 47 ఏళ్లు ప్రజా జీవితానికే అంకితం చేసిన నాయకుడు..మన గడ్డ మీద పుట్టిన బిడ్డ. ఆయన రాజకీయ పాఠాలు నేర్చుకున్నది ఇక్కడే. తన వ్యూహ నైపుణ్యాలను నిరూపించుకున్నదీ ఈ నేలమీదే. చిత్తూరు ఉమ్మడి జిల్లా కేంద్రంగా నడిచిన నారా చంద్రబాబు నాయుడు అడుగుల విశేషాలు ఇవి.. నేడు 75వ పుట్టినరోజు జరుపుకుంటున్న సందర్భంగా ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం...

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

దటీజ్ చంద్రబాబు..!

- సంక్షోభాలనే అవకాశాలుగా మార్చుకున్న మేరునగధీరుడు
- తొలి రాజకీయ అడుగులు జిల్లాలోనే

తొలి అడుగులోనే ఢీ అంటే ఢీ

కాంగ్రెస్ పార్టీలో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన చంద్రబాబు మంత్రివర్గంలో కూడా చోటు దక్కించుకున్నారు. కాంగ్రెస్ వర్గ రాజకీయాల్లో వేగంగా పట్టు పెంచుకున్నారు. అప్పటికే జిల్లా కాంగ్రెస్‌లో పాతుకుపోయిన నల్లారి అమరనాథరెడ్డి వంటి బలమైన నేతను ఢీకొన్నారు.ఆయన్ను ఎదుర్కొనేందుకు జిల్లాలో నాటి సీనియర్ నేతలైన మంత్రి సి.దాస్, రాయలసీమ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్, పీలేరు ఎమ్మెల్యే మొఘల్ సైఫుల్లా బేగ్ వంటి నేతల మద్దతు తీసుకున్నారు. ఐదేళ్ళ స్వల్ప వ్యవధిలోనే జిల్లాలో బలమైన వర్గ నేతగా ఆవిర్భవించారు.

జడ్పీ చైర్‌పర్సన్‌గా కుతూహలమ్మ ఎన్నిక

కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించిన అభ్యర్థిని కాదని కుతూహలమ్మను జడ్పీ చైర్‌పర్సన్‌గా చేసిన సందర్భం.. చంద్రబాబు రాజకీయ వ్యూహ చతురతకు అద్దం పడుతుంది. చిత్తూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి 1980లో ఎస్సీలకు రిజర్వయింది. కాంగ్రెస్ అధిష్ఠానం నగరి సమితి అధ్యక్షుడు దొరస్వామిని పార్టీ అధికారిక అభ్యర్థిగా ప్రకటించింది. ఈ నిర్ణయం వెనుక అప్పటి సీనియర్ మంత్రి నల్లారి అమరనాథరెడ్డి ఉన్నారని గ్రహించిన చంద్రబాబు తన వర్గం తరపున అప్పటికి చిన్నగొట్టిగల్లులో ప్రభుత్వ వైద్యురాలిగా పనిచేస్తున్న గుమ్మడి కుతూహలమ్మను అభ్యర్థిగా రంగంలోకి దింపారు. గెలిపించుకోవడానికి కృషి చేశారు. మంత్రి దాసు (సత్యవేడు), పీలేరు, మదనపల్లె ఎమ్మెల్యేలు జీవీ చంద్రశేఖర రెడ్డి, గంగారపు వెంకటనారాయణ, వాయల్పాడు, బంగారుపాళ్యం, చిన్నగొట్టిగల్లు, పుంగనూరు, పలమనేరు సమితీల ప్రెసిడెంట్లు చింతల సురేంద్ర రెడ్డి, అరగొండ రాజారెడ్డి, బుడుగు భాస్కర రెడ్డి, రామకృష్ణారెడ్డి (అమరనాథ రెడ్డి తండ్రి), రామే గౌడ్‌లతో పాటు గల్లా అరుణకుమారి తండ్రి పాటూరు రాజగోపాల నాయుడు వంటివారు చంద్రబాబుకు మద్దతుగా నిలిచారు. కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసిన దొరస్వామికి మాత్రం చెంగల్రాయ నాయుడు, నల్లారి అమరనాథ రెడ్డి, అప్పట్లో సమితి ప్రెసిడెంట్‌గా ఉన్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి తదితరులు మద్దతు ఇచ్చారు. జడ్పీ ఎన్నిక సమయంలో కోఆప్షన్ మెంబర్‌గా కుతూహలమ్మను ప్రపోజ్ చేసి ఎన్నుకున్నారు. దీంతో ఆమెకు కూడా ఓటింగ్‌లో పాల్గొనే హక్కు వచ్చింది. ఓటు హక్కు కలిగిన మదనపల్లె ఎమ్మెల్యే వెంకటనారాయణరెడ్డి కేరళలోని ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో ఉన్నారు. ఆయనను చంద్రబాబు వ్యతిరేక వర్గం తమ క్యాంపులోకి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించింది. విషయం తెలుసుకున్న చంద్రబాబు వెంకటనారాయణరెడ్డిని కేరళ నుంచి తీసుకొచ్చేశారు. ఒక్క ఓటు తేడాతో కుతూహలమ్మ జడ్పీ చైర్‌పర్సన్‌గా గెలిచారు. ఈ పరిణామం చంద్రబాబు రాజకీయ జీవితంలోనే ఒక మలుపుగా మారింది. దీనిపై అధిష్ఠానం సీరియస్ అయింది. చంద్రబాబుతో పాటు మంత్రి దాసు, రాయలసీమ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మెన్ సైఫుల్లాబేగ్‌లను సస్పెండ్ చేసింది. అయితే కొన్నాళ్ల తర్వాత సస్పెన్షన్ ఎత్తేశారు.

గురువు చంద్రబాబు


కుతూహలమ్మ నిత్యం చంద్రబాబుకు శిష్యురాలిగా చెప్పుకునేది. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ అయ్యాక కూడా పబ్లిక్ మీటింగుల్లో నాకు గురువు చంద్రబాబే అని చెప్పుకునే వారు.

టీడీపీలోకి ఇలా వచ్చారు

1978-83 మధ్యలో చంద్రగిరి నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా పనిచేసిన చంద్రబాబు 1983లో చంద్రగిరి నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి టీడీపీ అభ్యర్థి మేడసాని వెంకట్రామానాయుడు చేతిలో ఓటమి చెందారు. 1984లో ఎన్టీఆర్ వైద్యం కోసం అమెరికా వెళ్లినప్పుడు నాదెండ్ల భాస్కర రావు కాంగ్రెస్‌తో చేతులు కలిపి అడ్డదారిలో అధికారాన్ని చేజిక్కించుకున్నాడు. అప్పటికే భువనేశ్వరిని పెళ్లి చేసుకుని ఎన్టీఆర్ అల్లుడిగా ఉన్న చంద్రబాబు, ఆ ఉపద్రవాన్ని తిప్పికొట్టడానికి రంగప్రవేశం చేశారు. ఎమ్మెల్యేలందర్నీ మైసూరులో క్యాంపు నిర్వహించి బలప్రదర్శన చేసి నెల రోజుల్లోనే మళ్లీ ఎన్టీఆర్‌ను సీఎం చేశారు. దీంతో ఎన్టీఆర్ ఆయనకు పార్టీ ప్రధాన కార్యదర్శి పగ్గాలను అప్పగించారు. అలా చంద్రబాబు అప్పటి నుంచి టీడీపీలో కీలకంగా వ్యవహరిస్తూ వచ్చారు. ఆ తర్వాత కొన్నాళ్లు కర్షక పరిషత్ చైర్మన్‌గా కూడా పనిచేశారు.


జిల్లాలో ఎదురులేని నేతగా

చంద్రబాబు టీడీపీ ప్రధాన కార్యదర్శిగా ఉంటూ పార్టీ మీదే ఎక్కువగా ఫోకస్ చేసేవారు. నియోజకవర్గాల వారీ సమావేశాలను ఆయా ప్రాంతాల్లో కింద కూర్చొని మరీ నిర్వహించేవారు. చిత్తూరు- పుత్తూరు రోడ్డులోని ఆర్ఎల్ఎస్ కళ్యాణమండపానికి ఎదురుగా ఉన్న మామిడి తోటలో ఎన్నోసార్లు కింద కూర్చొని సమావేశమయ్యేవారు. మండల పార్టీ ప్రెసిడెంట్లను కూడా పేరు పెట్టి పిలిచేంత పట్టును పెంచుకున్నారు.సంస్థాగతంగా పార్టీపై పట్టు పెంచుకున్న చంద్రబాబు 1985 ఎన్నికల నుంచీ జిల్లాలో ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపు విషయంలో ప్రభావం చూపుతూ వచ్చారు. తన మద్దతుదారులకు టికెట్లు ఇప్పించడంతోపాటు వారి గెలుపుపై కూడా వ్యక్తిగత శ్రద్ధ చూపించారు. పార్టీలో అసంతృప్తులను,అసమ్మతి వర్గీయులను బుజ్జగించడం,సర్దుబాట్లు చేయడం, అభ్యర్థులకు పార్టీ ఇచ్చే ఆర్థిక సాయానికి తోడు వ్యక్తిగతంగా సాయం చేయడం వంటి చర్యలతో ఎమ్మెల్యేలు నైతికంగా చంద్రబాబు వైపు మొగ్గు చూపడం మొదలైంది. అలా జిల్లాలో పూర్తిస్థాయి పట్టు సాధించారు. ఆ క్రమంలో మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు వంటి బలమైన నేతలు తొలుత చంద్రబాబును వ్యతిరేకించినా తర్వాత చంద్రబాబుతో కలసిపోయి ఆయన వెన్నంటి నడిచారు. దీంతో జిల్లా టీడీపీలో చంద్రబాబుకు ఎదురే లేకుండా పోయింది.



ఏఎస్ మనోహర్ ఎన్నిక కోసం

1994లో ఎన్నికల్లో 15 స్థానాలకు గానూ చిత్తూరు మినహా 14 చోట్ల టీడీపీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలిచారు. చిత్తూరులో మాత్రం టీడీపీ అభ్యర్థి ఏఎస్ మనోహర్ పోటీ చేసి ఓడిపోయారు. 1995లో వచ్చిన మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అధిష్ఠానం ఏఎస్ మనోహర్‌ను చైర్మన్ అభ్యర్థిగా ఎంపిక చేసింది. మొత్తం 35 వార్డులుండగా.. జిల్లాలోని 14 మంది ఎమ్మెల్యేలు చిత్తూరులో మకాం వేశారు. చంద్రబాబు ఆధ్వర్యంలో ఒక్కో ఎమ్మెల్యేకి రెండు వార్డుల ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఫైనాన్స్ మినిస్టర్ హోదాలో ఉండి చంద్రబాబు చిత్తూరులోనే మకాం వేసి ఏఎస్ మనోహర్‌ను గెలిపించుకున్నారు. జ్యోతినాథ్ కాంగ్రెస్ తరఫున, సీకే లావణ్య స్వతంత్రంగా పోటీ చేసి ఏఎస్ మనోహర్ చేతిలో ఓడిపోయారు.


జన్మదిన శుభాకాంక్షలు
అమరావతి రూపశిల్పి, స్వర్ణాంధ్రప్రదేశ్ సృష్టికర్త,
కార్యదీక్షపరులు, ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం
అహర్నిశలు శ్రమిస్తున్న
మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
గా.శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.
కురుగొండ్ల రామకృష్ణ
ఎమ్మెల్యే, వెంకటగిరి
పాశిం సునీల్‌కుమార్
ఎమ్మెల్యే, గూడూరు
శ్రీమతి నెలవల విజయశ్రీ
ఎమ్మెల్యే, సూళ్ళూరుపేట

వైభవంగా నృసింహస్వామి కల్యాణోత్సవం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మదర్ అకాడమీ పాఠశాలలో పెనుశిల నృసింహస్వామి కల్యాణమహోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. సాయంత్రం 4 గంటల నుంచి స్వామి, అమ్మవార్ల నగరోత్సవం, 6గంటలకు విష్ణు సహస్రనామ పారాయణ, లక్ష్మీ అష్టోత్తరం, గోవిందనామాలు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవారికి కల్యాణం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గంగోడు నాగేశ్వరరావు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మున్సిపల్ చైర్ పర్సన్ నక్కా భానుప్రియ, నక్కా వెంకటేశ్వరరావు, చిరువేళ్ల ప్రభాకర్ రావు, పాఠశాల డైరెక్టర్ రమేష్, కరస్పాండెంట్ పవన్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ దొంతు శారద, సీఐ రమణ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

రెండు బైక్‌లను ఢీకొన్న ఆటో

ముగ్గురికి గాయాలు

బాలాయపల్లి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) రెండు బైక్‌లను ఆటో ఢీకొనడంతో ముగ్గురుకి గాయాలైన ఘటన శనివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు... డక్కిలి మండలం మాటుమడుగు గ్రామానికి చెందిన వెంకటరత్నయ్య తన కుమార్తెను గూడూరు కళాశాలలో చేర్పించేందుకు అదే మండలంలోని వెంగమనాయుడు పల్లికి చెందిన తన బామర్ధి బాలగురవయ్య కలిసి చెరో మోటరు బైక్‌పై గూడూరుకు బయలుదేరారు. బాలాయపల్లి మండలంలోని మన్నూరు సమీపాన వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆటో వేగం ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌లలో వెళుతున్న బాలగురవయ్య, వెంకటరత్నయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంకటరత్నయ్య కుమార్తె సంజనకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాల గురవయ్యను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ-వేస్ట్‌తో పర్యావరణానికి చేటు

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీలో కలెక్టర్

గూడూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఈ-వేస్ట్‌తో పర్యావరణం కలుషితమవుతోందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెలలో ఈ - వేస్ట్ వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. మనం నిత్యం వాడే ఎలక్ట్రానిక్ వస్తువులు చెడిపోయిన తర్వాత ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల పర్యావరణానికి హాని కలిగించడమేగాక అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ఈ-వేస్ట్‌ను మున్సిపల్ సిబ్బందికి అందజేస్తే వారు జాగ్రత్తగా వినాశనం చేస్తారన్నారు. ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి సచివాలయంలోనూ ఈ-వేస్ట్ సేకరణ కేంద్రాలను అందుబాటులో ఉంచామని, అక్కడ అందజేయాలని కోరారు. సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ స్వచ్ఛాంధ్రకు ప్రజలు సహకారం అందించాలన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు జ్ఞాపికలు అందజేసి పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.



మొక్కలు నాటుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి టవర్ క్లాక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో డీఎస్పీ గీతా కుమారి, కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దారు చంద్రశేఖర్, నాయకులు పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, గుండాల లీలావతి, కల్పన, భారతి, పట్టాభిరామిరెడ్డి, ఏసుపాక పెంచలయ్య, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ అ'ధర'హో..!

టిక్కీ బస్తా రూ.6వేలు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రతతో పోటీపడుతూ గూడూరు మార్కెట్లో నిమ్మకాయల ధర కూడా రోజురోజుకూ పెరుగుతోంది. శనివారం 50 కిలోల టిక్కీ బస్తా రూ.6వేలు(కిలో రూ.120) పలికింది. సన్న కాయలు సైతం కిలో రూ.100 వరకు అమ్ముడుపోయాయి. పండ్లు, డాగులు(డ్యామేజీ ఉన్నవి) కిలో రూ.70 దాకా పలికాయి. ఈ ఏడాది ఈ స్థాయిలో ధర పలకడం ఇదే ప్రథమం కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన నగరాల్లో గూడూరు నిమ్మకాయలకు ప్రత్యేక స్థానముంది. ఢిల్లీ, లక్నో, వారణాసి, ముంబై, కోల్‌కతా తదితర నగరాలకు ఇక్కడి నుంచి నిత్యం 350 మెట్రిక్ టన్నులు రవాణా అవుతుంటాయి. కాగా, మిగతా దక్షిణాది రాష్ట్రాల్లోనూ ఈ ఏడాది నిమ్మకాయల దిగుబడి ఎక్కువగా ఉండడంతో గూడూరు నుంచి రవాణా తగ్గిందని, లేకపోతే మరింత ధర వచ్చేదని వ్యాపారులు చెబుతున్నారు.



నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

మట్కా స్థావరంపై పోలీసుల దాడి

8 మంది అరెస్టు, రూ.26,200 స్వాధీనం

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో మట్కా స్థావరంపై పోలీసులు దాడి చేశారు. 8 మందిని అరెస్టు, రూ.26, 200 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ రమణ మీడియాకు వెల్లడించారు. కొంతకాలంగా పట్టణంలోని బొమిడి కాలువ వద్ద మట్కా నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో నిఘా వేశారు. శనివారం సీఐ రమణ, ఎస్ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మట్కా నిర్వహిస్తున్న చింతలపూడి శ్రీనివాసులు, మోతీ నాగేశ్వరరావు, షేక్ బషీర్, షేక్ బాబు షాబే, పుత్తు సుబ్రహ్మణ్యం, దక్షాంది సుబ్రహ్మణ్యం, తిరువీధుల మురళి, దొంతు మస్తాన్‌ను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.26200 నగదు స్వాధీనం చేసుకున్నారు. 51మంది బాధితుల చిరునామాలు లభించాయని, వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తామని సీఐ తెలిపారు.



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు



ఏరియా ఆస్పత్రికి వాటర్ కూలర్ల వితరణ

గూడూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రికి శనివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో వాటర్‌కూలర్లను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ రోటరీక్లబ్ వ్యవస్థాపకుడు పాల్‌హారీస్ జయంతి సందర్భంగా శివరామిరెడ్డి దాతృత్వంతో వాటర్ కూలర్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో మునిగిరీష్, శ్రీధర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, రఘురామిరెడ్డి, మయూరి శ్యామ్‌యాదవ్, జీజీ నాయుడు, కిరణ్‌చక్రవర్తి, రామ్‌ప్రసాద్, బల రామిరెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన దేవికా చౌదరి



పురందేశ్వరితో దేవికా చౌదరి

బాలాయపల్లి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) బాలాయపల్లికి గ్రామానికి చెందిన రావి ఫౌండేషన్ చైర్‌పర్సన్ రావి దేవికాచౌదరి బీజేపీలో చేరారు. శనివారం విజయవాడలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. రాజకీయ కుటుంబానికి చెందిన దేవికా చౌదరి వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం స్పోక్స్ పర్సన్ పదివికి ఇటీవల రాజీనామా చేశారు. ప్రధాని మోదీ విధానాలకు ఆకర్షితురాలై బీజేపీలో చేరానని దేవికా చౌదరి చెప్పారు. కార్యక్రమంలో రవిచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా చిట్టమూరమ్మ గ్రామోత్సవం

చిట్టమూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత చిట్టమూరమ్మ ఉత్సవాల్లో భాగంగా శనివారం వైభవంగా గ్రామోత్సవం జరిగింది. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలకంరించి గ్రామోత్సవం నిర్వహించారు. చిట్టమూరు, కొత్తగుంట గ్రామాల్లోని భక్తులు వీధులను హరివిల్లులతో అలంకరించారు. గ్రామపెద్దలు గణపర్తి కిషోర్ నాయుడు, గోపాల్ నాయుడు, అశోక్ నాయుడు, మోహన్ నాయుడు, మధు నాయుడు, సతీష్ నాయుడు పాల్గొన్నారు.



టిడ్కో గృహాల లబ్ధిదారులకు

రుణాలు మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ రవీంద్ర

గూడూరు అర్బన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాల లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు అందించేలా ఆర్పీలు చర్యలు తీసుకోవాలని మెప్మా పీడీ డాక్టర్ రవీంద్ర అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా పీడీ మాట్లాడుతూ గతంలో టిడ్కో గృహాలు మంజూరై రిజిస్ట్రేషన్ కానీ, మార్ట్‌గేజ్ కానీ వారిని గుర్తించి వారికి రిజిస్ట్రేషన్ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీసీవో రామసుబ్బారావు, సిటీమిషన్ మేనేజర్ పెంచలయ్య, కమ్యూనిటీ ఆర్గనైజర్లు చందన, లత, డీఈవో ఉషా తదితరులు పాల్గొన్నారు.

క్రిస్ సిటీ నిర్మాణ పనుల పరిశీలన

చిల్లకూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మినపట్నం సమీపంలోని క్రిస్ సిటీలో జరుగుతున్న నిర్మాణ పనులను శనివారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రిస్ సిటీలో మౌలిక సదుపాయాలైన లే అవుట్‌లు, రోడ్లు, మంచినీటి ట్యాంకులు, వంతెనల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జనరల్ మేనేజర్ చెన్నకేశవులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర సాధనకు సహకరించండి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర... స్వర్ణాంధ్ర సాధనకు అందరూ సహకరించాలని ఎంపీడీవో మురళికృష్ణ అన్నారు. శనివారం సూళ్లూరుపేట మండలం కోటపోలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛాంధ్ర... స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, సీఐ రమణ అన్నారు. శనివారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పరంధామయ్య, కౌన్సిలర్ ఆరి శంకరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

డక్కిలి: స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా డక్కిలిలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కమ్మపల్లి రోడ్డు సెంటరులో మానవ హారంగా ఏర్పడి ప్లాస్టిక్ వస్తువుల వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణి ఆధ్వర్యంలో ఆర్ఐ ప్రియాంక, వీఆర్వోలు విజయకుమార్, ఆమని తదితరులు పరిసరాలను శుభ్రం చేశారు. అలాగే వెంకటేశ్వరపురం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం పెంచలయ్య ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది.

చిట్టమూరు: మండల పరిధిలోని యల్లసిరి, కొత్తగుంట గ్రామాల్లో తహసీల్దారు సతీష్ కుమార్, ఎంపీడీవో మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్నారు. పొడి, తడి చెత్త సేకరించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు కాపులూరు చెంచురామయ్య ఆచారి, హౌసింగ్ ఏఈ సుధీర్, వీఆర్వోలు కోటయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తిన్నెలపూడిలో పోషణ్ పక్వాడ

కోట, ఏప్రిల్ 19: మండల పరిధిలోని తిన్నెలపూడి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పక్వాడ కార్యక్రమం జరిగింది. సీడీపీవో మునికుమారి, సూపర్‌వైజర్ కృష్ణమ్మ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు మొదటి వెయ్యి రోజుల సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు మాధవి, శశి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సత్కారం

పెళ్లకూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శెట్టిపల్లి మునిశేఖర్ ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో శనివారం పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పెళ్లకూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా, దొరవారిసత్రం ఎంఈవోగా మునిశేఖర్ అందించిన సేవలను ఎంఈవో మించల శంకరయ్య కొనియాడారు. మునిశేఖర్, వసుంధర దంపతులను ఉపాధ్యాయులు, నాయకులు సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు పేర్నాటి వెంకటేశ్వర్లు, గడదాసు వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుడు, న్యాయవాది పసల గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మునిశేఖర్, వసుంధర దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



ఈ - వేస్ట్‌పై అవగాహన

ఓజిలి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలం పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఎంపీడీవో విజయలక్ష్మి, అధికారులు ఈ వేస్ట్‌పై అవగాహన కల్పించారు. ఈ వేస్ట్ పేరుకుపోవడం వల్ల ఎదురయ్యే పర్యావరణ సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో శైలజ, ప్రధానోపాధ్యారాలు మంజుల, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు అధికారులు, కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వేసవిలో సంభవించే అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి నారాయణ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని పలు ఆసుప్రతిలోని సిబ్బందికి అగ్నిమాపక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్, నిప్పులు, కరెంటు తదితర వస్తులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆసుపత్రిలో ఉన్న అగ్నిమాపక వస్తువులు తరచూగా పరిశీలించాలన్నారు. ఈ కారక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో అగ్నిమాపక వారోత్సవాలు

కోట, ఏప్రిల్ 19: కోట ప్రభుత్వాస్పత్రిలో శనివారం అగ్నిమాపక అధికారి హరీష్ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగితే మంటల్లో చిక్కుకున్న వ్యక్తులను తక్షణం కాపాడే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో సిద్దిక్, శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

భువనేశ్వరస్వామి ఆలయంలో మహాకుంభాభిషేక వేడుకలు

తడ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): బోడిలింగాలపాడు వద్ద ఉన్న భువనేశ్వరస్వామి ఆలయంలో మహాకుంభాభిషేక వేడుకలు ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం నుంచి యాగశాలో హోమాలు, పూజాలు నిర్వహించారు. లక్ష్మీపూజ, వేదపారాయణం, కుంభాభిషేకం, నెయ్యాభివాసం తదితర కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి నూతన విగ్రహాల ప్రతిష్ఠ, గోపూజ జరిగింది.

తెలుగుగంగ కాలువలో మహిళ మృతదేహం

డక్కిలి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం నరసనాయుడుపల్లి వద్ద తెలుగు గంగ కాలువలో ఓ మహిళ మృతదేహం కొట్టుకుపోవడాన్ని గ్రామస్తులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందిచగా ఎస్ఐ శివశంకర్ సంఘటనా స్థలానికి వెళ్లేలోపే మృతదేహం నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. మృతదేహ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఎర్రటి చీర, తెలుపు రంగు జాకెట్ ధరించి వున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మృతదేహం బోర్లాపడి ఉండటంతో గుర్తించలేకపోయామన్నారు.

పులివెండ్రలో రీసర్వే

తడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పులివెండ్ర గ్రామంలో శనివారం నుంచి రీసర్వే మొదలయ్యింది. తహసీల్దార్ శరత్‌బాబు, రెవెన్యూ అధికారులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.